

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 15.09.2025 | సంపుటి : 2 | సంచిక :223 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 15.09.2025 | volume : 2 | Issue : 223 | Pages : 8 | Cost : 2/- |


# అట్టుడికిన బ్రిటన్

- 'యునైట్ ది కింగ్‌డమ్' పేరిట లండన్‌లో భారీ ర్యాలీ
- ఆందోళనలో 1.50 లక్షల మంది
- వలసదారులను వెనక్కి పంపాలంటూ నినాదాలు
- నిరసనకు ఎలాన్ మస్క్ మద్దతు

**లండన్:** వలసలకు వ్యతిరేకంగా బ్రిటన్ అట్టుడుకుతోంది. దేశంలోకి ప్రవేశిస్తున్న వలసదారులను వెనక్కు పంపేయాలని డిమాండ్ చేస్తూ రాజధాని లండన్‌లో ఆందోళనకారులు భారీ స్థాయి ర్యాలీ నిర్వహించారు. దీంట్లో దాదాపు 1.10-1.50 లక్షల మంది పాల్గొన్నారు. సెంట్రల్ లండన్‌లో శనివారం జరిగిన ఈ ర్యాలీ బ్రిటన్ చరిత్రలోనే అతి పెద్దదని మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు. వలసలు, ఇస్లామీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో 'యునైట్ ది కింగ్‌డమ్' పేరిట ఈ ప్రదర్శన జరిగింది. మరోవైపు జాత్యాహంకారానికి వ్యతిరేకంగా 'స్టాండ్ అప్ టు రేసిజమ్' అనే నిరసన కూడా చేపట్టారు. దీనిలో 5వేల మంది పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని వారు కోరారు. ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు భారీగా పోలీసులు మోహరించారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు వారు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ ఘటనలో 26 మంది అధికారులు గాయపడినట్లు సమాచారం. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.





## పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు
# కాంగ్రెస్ మద్దతు

### 1962లో అస్సామీలకు నెహ్రూ చేసిన గాయాలింకా మానలేదు

### అస్సాం పర్యటనలో మోదీ వ్యాఖ్యలు

మన సైన్యానికి అండగా నిలవాల్సిన కాంగ్రెస్ పార్టీ.. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు మద్దతిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులను, జాతి వ్యతిరేక శక్తులను ఆ పార్టీ రక్షిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయం రుజువైందని పేర్కొన్నారు. అస్సాంలో ప్రధాని మోదీ ఆదివారం మంగళ్‌దోయి, నుమాలీగఢ్‌లలో రూ.18,530 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

02

## 'జూబ్లీహిల్స్'లో గెలుపే లక్ష్యంగా
# పని చేయాలి

### పథకాలు, పనులపై ఇంటింటికి వెళ్లి ప్రచారం

### పోలింగ్ కేంద్రాల వారీగా ప్రణాళికలు

- నియోజకవర్గ నేతలకు, మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- అభ్యర్థి ఎంపికను అధిష్ఠానం చూసుకుంటుందని స్పష్టీకరణ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని... కాంగ్రెస్ కచ్చితంగా గెలిచి తీరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రులు, నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జులు, ఇతర నేతలతో సీఎం సమావేశమై ప్రచార వ్యూహంపై చర్చించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వివిధ డివిజన్ల ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.

**హైదరాబాద్, సెప్టెంబరు 14 :** పార్టీ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం... ప్రతి డివిజన్‌కు రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల ఛైర్మన్ లను, నియోజకవర్గానికి ముగ్గురు మంత్రులు పొన్నం, తుమ్మల, వివేక్‌లను ఇన్‌ఛార్జులుగా నియమించామని సీఎం తెలిపారు. వీరంతా సమ న్వయంతో... నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షి స్తూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించా రు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించిన ఇన్‌ఛార్జులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో ఏమైనా లోపాలుంటే మార్పులు చేసేందు కు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసాను వారికి కల్పించాలని మంత్రులకు చెప్పారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయంతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం అన్నారు.

మిగతా 2 లో





# చిరకాల ప్రత్యర్థి చిత్తు

### పాక్‌పై భారత్ ఘనవిజయం

### విజృంభించిన కుల్‌దీప్, బుమ్రా, అక్షర్

07

పాకిస్థాన్‌తో మ్యాచ్ వద్దంటూ ఓవైపు దేశవాప్తంగా నిరసన స్వరాలు కొనసాగుతుండగానే, ఆసియా కప్ టీ20 టోర్నీలో ఆ జట్టుతో తలపడ్డ టీమ్‌ఇండియా.. ప్రత్యర్థిని చిత్తుగా ఓడించి తన ఆధిపత్యాన్ని చాటింది. ఆదివారం పాక్‌పై 7 వికెట్ల తేడాతో నెగ్గిన భారత్ సూపర్-4లో స్థానాన్ని ఖాయం చేసుకున్నట్లే.

## తెలంగాణ విమోచన ఘట్టం..
# గొప్ప పోరాటం



- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- మజ్లిస్ అంటే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు భయం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

02

తెలంగాణ విమోచన ఘట్టం చరిత్ర కాదని, తమ పరువు, ప్రతిష్ఠల కోసం ఇక్కడి ప్రజలు చేసిన గొప్ప పోరాటమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈనెల 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న విమోచన దినోత్సవంలో భాగంగా కేంద్ర సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆదివారం గవర్నర్ ప్రారంభించారు.



## నేటి నుంచి వృత్తి విద్యా
# కళాశాలల బంద్


- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై యాజమాన్యాల నిర్ణయం
- సెలవులు ప్రకటించిన పలు ఇంజినీరింగ్ కళాశాలలు
- సమాఖ్య ప్రతినిధులతో అర్ధరాత్రి దాకా సర్కారు చర్చలు.. నేడు మరోమారు

02

## కన్నతల్లిపై
# అత్యాచారయత్నం

- కొడుకును కొట్టి చంపిన తండ్రి
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన

02



# 'అలయ్ బలయ్'కి రండి

### సీఎంను ఆహ్వానించిన దత్తాత్రేయ

**హైదరాబాద్, సెప్టెంబరు 14 :** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అక్టోబరు 3న నిర్వహించే 'అలయ్ బలయ్-2025' వేడుకలకు హాజరవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కోరారు. ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేడుకలకు రావాలని కోరుతూ..సీఎంకు ఆహ్వాన పత్రం అందజేశారు.



# 'జూబ్లీహిల్స్'లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయం అధిష్ఠానం చూసుకుంటుందని, ఈలోగా ప్రచారంపై అందరూ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. 'పార్టీ విజయం కోసం పనిచేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉంది. మీ పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటాను. గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

### అంకెలు సహా ప్రచారం చేయాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తరువాత ప్రజల కోసం పెద్దఎత్తున చేపట్టిన పనుల గురించి అంకెలు సహా ప్రచారం చేయాలని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన ముఖ్య నేతలంతా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికలో గెలుపుతో నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం కలుగుతుందని ఆయన వివరించారు. ఉప ఎన్నికకు బాధ్యులుగా నియమితులైన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్‌లు కూడా ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సూచనలిచ్చారు.



# హైదరాబాద్‌లో భారీ వర్షం

**హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం ధాటికి హబీబ్‌నగర్‌లోని అఫ్జల్‌సాగర్ కాలువలో ఇద్దరు గల్లంతయ్యారు. డ్రైనేజీలో మామ, అల్లుడు కొట్టుకుపోయారు. మామను కాపాడే ప్రయత్నంలో అల్లుడు కూడా గల్లంతయ్యాడు. వీరిద్దరి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. అలాగే, ముషీరాబాద్‌లో ఓ యువకుడు నాలాలో కొట్టుకుపోయాడు. ముషీరాబాద్ డివిజన్ వినోబా కాలనీకి చెందిన సన్నీ (26) రాత్రి 9.30 గంటల సమయంలో స్థానికంగా ఉన్న నాలా పక్కన ఉన్న గోడపై స్నేహితులతో మాట్లాడుతుండగా ఒక్కసారిగా గోడ కూలిపోయింది. దీంతో ఆ యువకుడు నాలాలో పడి కొట్టుకుపోయాడు. వెంటనే అతని స్నేహితులు తాడుతో రక్షించేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సంఘటన స్థలానికి హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది వచ్చి గల్లంతైన వ్యక్తి కోసం చర్యలు చేపట్టారు. స్థానిక యువకులు పెద్ద ఎత్తున నాలా ప్రవాహం వైపు కర్రలు, తాళ్లతో సన్నీ ఆచూకీ కోసం ప్రయత్నాలు చేపట్టారు. మరోవైపు, షేక్‌పేట, రాయదుర్గం, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట, ముషీరాబాద్, రామ్‌నగర్, తార్నాక, ఎల్బీనగర్, కాచిగూడ, కుషాయిగూడ, కాప్రా, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. వర్షం నీటితో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంజారాహిల్స్‌లో జలమయమైన రహదారులను అధికారులతో కలిసి జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించారు.

# పౌరుల ప్రాణాల కంటే పాక్‌తో క్రికెట్ ముఖ్యమా : ఒవైసీ

**హైదరాబాద్:** 'పౌరుల ప్రాణాల కన్నా డబ్బే విలువైందా? బీసీసీఐకి ఈ ఒక్క మ్యాచ్ నుంచి రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్లు వస్తుండొచ్చు! మరి 26 మంది ప్రాణాలకు విలువలేదా?' అని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిలదీశారు. పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దారుస్సలాంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పాకిస్థాన్ ఉగ్రవాదం, భారత్-పాక్ క్రికెట్ పోటీలు, కేంద్రంలోని భాజపా ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. పహల్గాంలో భారతీయులను ఉగ్రవాదులు దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో భారత్-పాక్‌ల మధ్య క్రికెట్ పోటీ తగదని పేర్కొన్నారు. దేశభక్తిపై ఉపన్యాసాలిచ్చే భాజపా... క్రికెట్ మ్యాచ్ విషయంలో రనౌట్, స్టంపౌట్ అయిందని ఎద్దేవా చేశారు. 26 మంది మృతుల కుటుంబాలతోనే తాముంటామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై చర్చలుండవని చెప్పిన ప్రధాని... పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడటాన్ని ఎలా అంగీకరిస్తున్నారో చెప్పాలన్నారు. మహ్మద్ ప్రవక్త జీవితందయ, క్షమాగుణం, న్యాయం, సమానత్వం అనే మార్గాలను చూపిస్తుందన్నారు. ఐక్యత, శాంతి, సామాజిక సేవలపై ముస్లింలు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఇతర మతాలవారితో సామరస్యాన్ని పెంపొందించుకోవాలని... పేదలకు,అవసరమైనవారికి సహాయం చేయాలని ఒవైసీ కోరారు. మోదీ అసమర్థ పాలన వల్ల ఇటు చైనాతో, అటు అమెరికాతో దేశం తీవ్రనష్టం చవిచూడాల్సి వస్తోందని విమర్శించారు.

# ఎస్ఎల్‌బీసీ ఘటన జరిగి 200 రోజులైనా ప్రభుత్వాల స్పందన కరవు

### భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్:** ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటన జరిగి 200 రోజులైనా, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆరు మృతదేహాలను ఇప్పటికీ వెలికితీయలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎలాంటి పరిహారమూ అందించలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యలకే జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపి హంగామా సృష్టించిన కేంద్ర ప్రభుత్వం, ఎస్ఎల్‌బీసీ ఘటనపై దర్యాప్తునకు ఒక్క బృందాన్ని కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. భారాస మళ్లీ అధికారంలోకి వచ్చాక.. 6 కుటుంబాలకు న్యాయం చేస్తామని, ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడానికి గల కారణాలపై విచారణ చేపడతామని కేటీఆర్ ప్రకటించారు.

## తెలంగాణ విమోచన ఘట్టం..

# గొప్ప పోరాటం

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- మజ్లిస్ అంటే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు భయం : కిషన్‌రెడ్డి



**హైదరాబాద్:** తెలంగాణ విమోచన ఘట్టం చరిత్ర కాదని, తమ పరువు, ప్రతిష్ఠల కోసం ఇక్కడి ప్రజలు చేసిన గొప్ప పోరాటమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈనెల 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న విమోచన దినోత్సవంలో భాగంగా కేంద్ర సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆదివారం గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన వర్చువల్ మ్యూజియాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ముందుకురావాలని సూచించారు. తెలంగాణ విమోచన కోసం ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, చేసిన పోరాటాలపై రూపొందించిన వర్చువల్ మ్యూజియం తరహాలోనే తమ రాష్ట్ర చరిత్రను సైతం చిత్రీకరించాలని త్రిపుర ముఖ్యమంత్రికి సూచిస్తానన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న వేడుకలకు ఈసారి ముఖ్యఅతిథిగా రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారని తెలిపారు. కొత్తగా రూపొందించిన వర్చువల్ మ్యూజియం లింకును ప్రతిఒక్కరూ తమ సెల్‌ఫోన్లలో ఓపెన్ చేసుకుని చూడాలని కోరారు. మజ్లిస్ అంటే కాంగ్రెస్, భారాస నేతలకు భయమని, అందువల్లే ఆ పార్టీలు విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, భాజపా రాష్ట్రాధ్యక్షుడు రామచందర్‌రావు, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బాలల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- చట్టాల్లోని అక్షరాలకు జీవం పోయాలి
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్


**హైదరాబాద్:** చట్టాలు అక్షరాలు మాత్రమేనని, వాటికి జీవం పోయడం మనందరి బాధ్యతని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ అన్నారు. బాలల రక్షణ అనేది సర్వీసులో ఉన్నవారి బాధ్యత మాత్రమే కాదని.. ప్రతి ఒక్కరిదని గుర్తుచేశారు. హైకోర్టు బాలల న్యాయ కమిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని జ్యుడిషియల్ అకాడమీలో 'దేశంలో ఆడపిల్లల రక్షణకు సురక్షితమైన, సానుకూల వాతావరణం కల్పించడం దిశగా' అన్న అంశంపై ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన చరిత్ర, సంస్కృతిని గమనిస్తే.. ఒకప్పుడు ఎవరూ తమ పొరుగువారిని ఆకలితో నిద్రపోనివ్వలేదని గుర్తుచేశారు. ఈ స్ఫూర్తి మళ్లీ రావాలని... ప్రతి బిడ్డను మన సొంతపిల్లల్లా చూడాలని కోరారు. ప్రతి గ్రామంలో బాలల జనాభా గణన చేయడం, వారి విద్యాస్థితిని పర్యవేక్షించడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి గ్రామ స్థాయి బాల రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఈ సంస్కరణలను అమలు చేయడం ద్వారా బాలలకు సురక్షిత, సానుకూల వాతావరణాన్ని సృష్టించడంలో దేశానికి ఆదర్శంగా నిలవగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### బాలికల విద్యకు పేదరికం, పితృస్వామ్యమే అడ్డు..

హైకోర్టు న్యాయమూర్తి, జువెనైల్ జస్టిస్ కమిటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ మౌసమీ భట్టాచార్య మాట్లాడుతూ.. బాలికల విద్యకు పేదరికం, పితృస్వామ్యం విధానాల వంటివి ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయని, ఇవి వారి హక్కులను పరిమితం చేస్తున్నాయని అన్నారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్, పోక్సో, బాల్య వివాహ నిషేధం, విద్యాహక్కు చట్టాలు ఉన్నప్పటికీ అమలులో సమస్యలు ఉన్నాయని అన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు బాలల దోపిడీని అరికట్టడంలో సహాయపడ్డాయని తెలిపారు. యునిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్(తెలంగాణ, ఏపీ, కర్ణాటక) జెలలేం బిర్హాను తఫెస్సె మాట్లాడుతూ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల్లో బాలికల ఆత్మహత్య రేటు ఎక్కువగా ఉందని చెప్పారు. బాలికల సాధికారతకు బహుముఖ విధానం అవసరమని.. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి యునిసెఫ్ నుంచి నిరంతర సహకారం అందుతుందని తెలిపారు. సమావేశంలో హైకోర్టు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ జ్యుడిషియల్ అకాడమీ అదనపు డైరెక్టర్ వి.బాలభాస్కర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ బి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్

### ఐదు ఆకృతులను పరిశీలించిన సీఎం చంద్రబాబు
### మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచన



**అమరావతి:** తిరుపతిలో అన్ని సౌకర్యాలతో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒకేసారి 150 బస్సులు నిలిపి ఉంచేలా 'బస్ బే' ఉండాలని సూచించారు. హెలిప్యాడ్‌తో పాటు.. రోప్ వే, వాణిజ్య కాంప్లెక్స్‌లు, మాల్స్, మల్టీప్లెక్స్‌లతో డిజైన్లు ఉండాలని పేర్కొన్నారు. బస్టాండ్ నిర్మాణంపై జాతీయ రహదారుల సరకు రవాణా నిర్వహణ సంస్థ, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం సమీక్షించారు. '13 ఎకరాల్లో నిర్మించే బస్ స్టేషన్.. రోజుకు లక్ష మంది ప్రయాణికుల రాకపోకలకు వీలుండాలి. బస్సులు వచ్చేందుకు, వెళ్లేందుకు రెండేసి చొప్పున మార్గాలు ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌కు అవసరమైన విద్యుత్తు కోసం సోలార్ రూఫ్ టాప్ ఉండాలి. భవిష్యత్తులో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే నడుపుతాం. ప్రతి బస్సుకూ ఛార్జింగ్ సౌకర్యం కల్పించాలి. రాష్ట్రంలో అన్ని బస్ స్టేషన్లనూ ఆధునికీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి' అని చెప్పారు. బస్ స్టేషన్‌కు సంబంధించి ఐదు నమూనాలను సీఎం పరిశీలించారు. వాటిని ఇంకా అభివృద్ధి చేసేందుకు భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# నేటి నుంచి వృత్తి విద్యా కళాశాలల బంద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై యాజమాన్యాల నిర్ణయం
- సెలవులు ప్రకటించిన పలు ఇంజినీరింగ్ కళాశాలలు
- సమాఖ్య ప్రతినిధులతో అర్ధరాత్రి దాకా సర్కారు చర్చలు.. నేడు మరోమారు



**హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలు సోమవారం నుంచి బంద్ పాటించనున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సమాఖ్య ప్రతినిధులతో ప్రభుత్వం ఆదివారం రాత్రి చర్చించింది. అర్ధరాత్రి దాటాక 12.30 గంటల వరకు ఈ చర్చలు కొనసాగాయి. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మరోమారు ఉప ముఖ్యమంత్రితో చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ఆర్కిటెక్చర్ వర్సిటీ ఆడిటోరియంలో సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సమ్మె చేపట్టినట్లు సమాఖ్య ఛైర్మన్ ఎన్.రమేశ్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.రవికుమార్, కోశాధికారి కొల్లి కృష్ణారావు తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు ఇంజినీరింగ్, ఫార్మా, బీఈడీ తదితర వృత్తి విద్యా కళాశాలలు బంద్ పాటిస్తాయని నేతలు స్పష్టంచేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమకు సహకరించాలని కోరారు. సమావేశంలో కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్‌కుమార్, నేతలు రాందాసు, నాగయ్య, పెద్దసంఖ్యలో కళాశాలల యజమానులు పాల్గొన్నారు. కాగా, పలు ఇంజినీరింగ్ కళాశాలలు సోమవారం నుంచి సెలవులు ప్రకటిస్తూ విద్యార్థులకు మెసేజ్‌లు పంపాయి. కొన్ని ఈ నెల 17 వరకు, మరికొన్ని వారం రోజులపాటు తరగతులు ఉండవని పేర్కొన్నాయి. కొన్ని మాత్రం ఆన్‌లైన్ తరగతులు ఉంటాయని తెలిపాయి. మూడు ప్రముఖ కళాశాలలు సహా మొత్తం నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు సెలవులు ప్రకటించలేదు.

### అర్ధరాత్రి దాకా చర్చలు సాగినా...

కళాశాలల సమాఖ్య ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి చర్చలు జరిపింది. ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు తదితరులు వారితో సమావేశమయ్యారు. రాత్రి 8.45 గంటలకు ప్రారంభమైన చర్చలు 12.30 గంటల వరకు కొనసాగాయి. "ప్రైవేటు కళాశాలల సమస్యలను అర్థం చేసుకున్నాం. సోమవారం ప్రభుత్వపరంగా ఒక నిర్ణయం తీసుకుంటాం. అప్పటివరకు సమ్మెను విరమించాలని కోరాం" అని భట్టి తెలిపారు. సోమవారం నాటి చర్చల్లో ప్రభుత్వం తెలిపే అంశాలను బట్టి తమ నిర్ణయం చెబుతామని కళాశాలల సమాఖ్య ప్రతినిధులు చెప్పినట్లు సమాచారం.

## పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు

# కాంగ్రెస్ మద్దతు

### 1962లో అస్సామీలకు నెహ్రూ చేసిన గాయాలింకా మానలేదు

### అస్సాం పర్యటనలో మోదీ వ్యాఖ్యలు



**మంగళ్‌దోయీ :** మన సైన్యానికి అండగా నిలవాల్సిన కాంగ్రెస్ పార్టీ.. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు మద్దతిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులను, జాతి వ్యతిరేక శక్తులను ఆ పార్టీ రక్షిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయం రుజువైందని పేర్కొన్నారు. అస్సాంలో ప్రధాని మోదీ ఆదివారం మంగళ్‌దోయీ, నుమాలీగఢ్‌లలో రూ.18,530 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రసంగించారు. "1962లో చైనాతో యుద్ధ సమయంలో అస్సామీలకు అప్పటి ప్రధాని నెహ్రూ చేసిన గాయాలు ఇంకా మానలేదు. భూపేన్ హజారికా లాంటి సంగీత దిగ్గజాలను అవమానించడం ద్వారా ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఆ గాయాలపై ఉప్పు జల్లుతున్నారు. భూపేన్‌కు జరిగిన అవమానంతో నాకు తీవ్రంగా బాధ కలిగింది. కానీ ప్రజలే గురువులు. భాజపా చేసేది తప్పా.. ఒప్పా అనేది వారే తేలుస్తారు" అని ప్రధాని పేర్కొన్నారు. నుమాలీగఢ్‌లోని రిఫైనరీలో రూ.7,230 కోట్లతో నిర్మించనున్న పెట్రో ఫ్లూడిసెడ్ కాటలిటిక్ క్రాకర్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. గోలాఘాట్ జిల్లాలో రూ.5,000 కోట్లతో నిర్మించిన వెదురు ఆధారిత ఇథనాల్ ప్లాంటును ప్రారంభించారు. ఇది ప్రపంచంలోనే రెండో తరంలో నిర్మించిన తొలి బయో ఇథనాల్ ప్లాంట్. విదేశాల నుంచి ముడి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించుకునేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. చమురు వెలికితీత, హరిత ఇంధన ఉత్పత్తిపై అధికంగా దృష్టి సారిస్తున్నామని వివరించారు.

# 17 నుంచి పోషణ మాస మహోత్సవం : మంత్రి సీతక్క



**హైదరాబాద్:** చిన్నారులు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 17 నుంచి అక్టోబరు 16 వరకు పోషణ మాస మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. జంక్‌ఫుడ్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు చక్కెర, ఉప్పు, నూనెల వాడకం పరిమితిపై ప్రచార కార్యక్రమాలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రతి సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ప్రాజెక్టుకు రూ.30వేలు, జిల్లాకు రూ.50వేల చొప్పున నిధులు విడుదల చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ ప్రజాప్రతినిధులకు లేఖలు రాసినట్లు వెల్లడించారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తామని, చిన్నపిల్లలకు మెరుగైన ఆహారపు అలవాట్లు అలవర్చుతామన్నారు.

# కన్నతల్లిపై అత్యాచారయత్నం

- కొడుకును కొట్టి చంపిన తండ్రి
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన

**జడ్చర్ల, సెప్టెంబరు 14 :** మద్యం మత్తులో మృగంలా మారి కన్నతల్లిపైనే లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిని అతని తండ్రే కొట్టి చంపేశాడు. తాగిన మైకంలో రాక్షసుడిగా మారినకొడుకుని అడ్డుకునే క్రమంలో ఆ తండ్రి హంతకుడు అయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన ఘటనకు సంబంధించి జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల మండలం పోలేపల్లికి చెందిన దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. వీరిలో ముగ్గురికి వివాహాలు అవ్వగా చిన్నకుమారుడు(28) అవివాహితుడు. ఆ దంపతులు తమ చిన్న కొడుకుతో కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. మద్యానికి బానిసైన చిన్న కొడుకు కొన్నాళ్లుగా జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటుపడ్డాడు. అయితే, మద్యం మత్తులో ఉండగా ఆ యువకుడు తన కన్నతల్లిపై ఇప్పటికే పలుమార్లు లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయం తెలిసి కొడుకు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తండ్రి.. ప్రవర్తన మార్చుకోవాలని కొడుకుని పలుమార్లు హెచ్చరించాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి మద్యం సేవిస్తూ ఉన్న ఆ యువకుడు అర్ధరాత్రి తర్వాత తల్లిపై లైంగిక దాడికి యత్నించాడు. కొడుకు తీరుతో హడలిపోయిన తల్లి గట్టిగా కేకలు వేయగా.. పక్క గదిలో నిద్రిస్తున్న ఆమె భర్త మేల్కొని కొడుకును అడ్డుకునేందుకు యత్నించాడు. కానీ, ఆ యువకుడు తండ్రిని కూడా నెట్టేశాడు. ఈ క్రమంలో చేతికి దొరికిన కర్రతో ఆ తండ్రి తన కొడుకు తల వెనుక, ముఖంపై బలంగా కొట్టాడు. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# యూరియా కోసం వెళ్తుండగా రోడ్డు ప్రమాదం.. ఇద్దరు రైతుల మృతి

**గూడూరు :** యూరియా కోసం వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు రైతులు మృతిచెందిన ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్ రెడ్డి, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన రైతులు దారావత్ వీరన్న(45) బాదావత్ లాల్య(70) బొద్దుగొండ రైతు వేదికలో యూరియా ఇస్తున్నారనే సమాచారంతో వేకువజామునే ద్విచక్రవాహనంపై బయలుదేరారు. జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్ వద్ద వరంగల్ వైపు వెళ్తున్న ఓ వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో లాల్య అక్కడికక్కడే మృతిచెందగా వీరన్న తీవ్రంగా గాయపడ్డారు. సీఐ సూర్యప్రకాష్ అక్కడకు చేరుకొని క్షతగాత్రుడిని పోలీస్ వాహనంలో ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. వీరన్నకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు..లాల్యకు భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ బాధిత కుటుంబాలను పరామర్శించారు.



## చైనా నౌకలను అడ్డుకొన్న తైవాన్

**తైవాన్ :** తైవాన్ కోస్ట్‌గార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సీజీఏ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్ట్‌గార్డ్ నౌక ఒకటికాగా.. మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్‌షా ద్వీపం వద్ద కార్యకలపాలు సాగిస్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకొంది. దీంతో తైవాన్-చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 సమయంలో రెండు చైనా నౌకలను డాంగ్‌షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్‌ను రంగంలోకి దించారు. అది శుక్రవారం చైనా కోస్ట్‌గార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో.. అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే.. ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రదేశానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది. ఇప్పటికే ఫిలిప్పీన్స్, తైవాన్ తమవిగా చెప్పుకొంటున్న స్కార్‌బోర్గ్ షోల్‌ను చైనా నేషనల్ నేచర్ రిజర్వ్‌గా ప్రకటించింది. దీనిపై ఇరు దేశాలు మండిపడ్డాయి. వివాదాస్పద ప్రదేశాల్లో తమ బలం చూపించుకోవడానికే చైనా ఇలా చేస్తోందనే ఆరోపణలున్నాయి.



## అమెరికాకు షాకిచ్చిన చైనా

### చర్చల వేళ రెండు దర్యాప్తులు మొదలు

**చైనా :** ఎప్పుడూ చైనాపై ఏదో ఒక దర్యాప్తు మొదలుపెట్టామని అమెరికా చెప్పడం సర్వ సాధారణంగా చూస్తుంటాం. కానీ, ఈ సారి సీను రివర్స్ అయింది. వాషింగ్టన్ రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంభిస్తోందంటూ.. బీజింగ్ రెండు దర్యాప్తులు మొదలుపెట్టింది. అది కూడా స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళ కావడం గమనార్హం. ఈ సమావేశంలో జాతీయ భద్రత, టిక్‌టాక్ సోషల్ మీడియా యాజమాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండెక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసీ చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలుపెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారు చేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండెక్టర్లపై వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తును చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ కానున్నారు. అమెరికా ఎగుమతి నియంత్రణలు, టారిఫ్‌లు వంటి వాటిని ఈ సందర్భంగా చైనా బలంగా ప్రస్తావించే అవకాశం ఉంది. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకొంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎమ్ఐసీ కూడా ఉంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు తన గురిని చైనాపై పెట్టారు. నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా సంకేతం పంపారు. భారీస్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో 100 శాతం కన్నా ఎంతో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



## పోరాడండి.. లేదంటే చనిపోతారు

### ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు

**యూఎస్ :** వలసలకు వ్యతిరేకంగా బ్రిటన్‌లో భారీ ఎత్తున నిరసనలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. లక్ష మందికి పైగా ఆందోళనకారులు పాల్గొన్న ఈ ర్యాలీకి ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతు తెలిపారు. వలసలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ర్యాలీలో మస్క్ వర్చువల్‌గా మాట్లాడారు. యూకేలో పాలన మార్పునకు పిలుపునిచ్చారు. దేశం విధ్వంసం అంచున ఉందని హెచ్చరించారు. 'బ్రిటన్ పౌరుడిగా ఉండటం గొప్ప విషయం. కానీ, దేశం నాశనం అవడం నేను ఇప్పుడు చూస్తున్నా. చిన్న కోతగా ఇది మొదలైంది. కానీ, ఇప్పుడు భారీగా అక్రమ వలసలతో నిండిపోయింది. ఇది ఇలానే కొనసాగితే మీరు హింసను కోరుకోకపోయినా.. విధ్వంసం మీ వరకు వస్తుంది. ఇప్పుడు మీ వద్ద ఉన్నవి రెండే మార్గాలు. తిరిగి పోరాడండి.. లేదంటే చనిపోతారు. ఇదే నిజమని నేను అనుకుంటున్నా' అని మస్క్ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం దిగిపోవాలని మస్క్ డిమాండ్ చేశారు. బ్రిటన్‌లో ప్రభుత్వ మార్పు జరగాలని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వెంటనే పార్లమెంటును రద్దు చేసి.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు, కన్జర్వేటివ్ పార్టీ యాక్టివిస్ట్ చార్లీ కిర్క్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని కూడా మస్క్ ప్రస్తావిస్తూ.. యూఎస్‌లో హింస పెరిగిపోయిందని వ్యాఖ్యానించారు.

# వరద సాయం.. ఉగ్ర సంస్థల పరం

### పాక్‌లో లష్కరే స్థావరాల పునరుద్ధరణ

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికలపై మేకపోతు గాంభీర్యాలు పలికే పాక్.. లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధి మారని దాయాది దేశం తినడానికి సరైన తిండి లేకపోయినా కూడా.. వరద భాదితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్ర స్థావరాల పునరుద్ధరణకు ఖర్చు చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబాను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన అనంతరం మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్‌ఈటికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ.1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకు అయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ.4.7కోట్లకు పైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. వీటికి కావాల్సిన నిధులను సేకరించడానికి పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరుతో విరాళాలు సేకరించి.. ఉగ్రసంస్థలకు మళ్లిస్తోంది. 2005లోనూ పాక్‌లో సంభవించిన భారీ భూకంపం సమయంలోనూ పాక్ ఇదే తరహాలో నిధులు సేకరించినట్లు భారత వర్గాలు పేర్కొన్నాయి. అప్పట్లో మానవతా సాయం పేరుతో సేకరించిన దాదాపు బిలియన్ డాలర్ల నగదులో




దాదాపు 80 శాతాన్ని ఉగ్రసంస్థ ఎల్‌ఈటిలో మౌలిక సదుపాయాల కోసం మళ్లించినట్లు తెలిపాయి.

#### లష్కరే క్యాంపు కార్యాలయం

మురీద్కేలోని మర్కాజ్ తోయిబా ఓ పెద్ద ఉగ్ర స్థావరం. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో విస్తరించింది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి కూడా ఉన్నాయి. ఉగ్రవాదాన్ని విస్తరించడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర. ఇది లష్కరే ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. దాదాపు 1,000 మంది వరకు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీనిలో అతిథి గృహ నిర్మాణానికి 2000 సంవత్సరంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ రూ.10 లక్షలు విరాళం ఇచ్చాడు. 26/11 ముంబయి ఉగ్రదాడికి పాల్పడిన వారిలో ఒకడైన అజ్మల్ కసబ్‌కు ఇక్కడే శిక్షణ ఇచ్చారు.

## న్యూయార్క్‌లో ముకేశ్ భారీ కొనుగోలు

**న్యూయార్క్ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, భారత కుబేరుడు ముకేశ్ అంబానీ విదేశాల్లో అత్యంత విలువైన ఆస్తులను కొనుగోలు చేయడం కొనసాగిస్తున్నారు. తాజాగా అమెరికాలోని న్యూయార్క్‌లో అత్యంత విలాసవంతమైన బిల్డింగ్ కొనుగోలు చేసినట్లు సమాచారం. న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు (సుమారు రూ.145 కోట్లు) వెచ్చించి సొంతం చేసుకున్నట్లు రియల్‌డీల్ తాజా నివేదిక వెల్లడించింది. 2023 ఆగస్టులో మాన్‌హాటన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబానీ ఈ కొత్త భవంతిని కొనుగోలు చేశారు. ఈ భవనాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎస్) అమెరికా విభాగం కొనుగోలు చేసింది. దీన్ని టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో దాదాపు 20 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసి, లగ్జరీ రెసిడెన్స్‌గా మార్చాలని ప్రణాళికలు చేశారు. కానీ అమలు కాలేదు. ఆ తర్వాత 2021లో ఆయన దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయానికి పెట్టారు. బ్లూంబర్గ్ బిలియనీర్ల ఇండెక్స్ ప్రకారం.. ముకేశ్ అంబానీ సంపద ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.2 లక్షల కోట్లు). దీంతో ఆయన దేశంలోనే అత్యంత సంపన్నమైన వ్యక్తిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. అలాగే



ప్రపంచవ్యాప్తంగా 18వ స్థానంలో నిలిచారు. తరువాత స్థానంలో ఆదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదానీ ఉండగా.. ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని ఆ ఇండెక్స్ తెలిపింది.

## అమెరికా సిస్టమ్స్‌పై ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకోవాలి : జీటీఆర్ఐ

భారత్ కచ్చితంగా దేశీయ క్లౌడ్ టెక్నాలజీ, ఆపరేటింగ్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ హెచ్చరించింది. సొంతంగా తయారు చేస్తున్న సైబర్ సెక్యూరిటీ, డేటా ఆధారిత ఏఐ వంటి అంశాల్లో కూడా స్వయంసమృద్ధి సాధిస్తే.. అదే అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని పేర్కొంది. భారత్ భద్రత, ఆర్థిక వ్యవస్థ.. అమెరికా సాఫ్ట్‌వేర్, క్లౌడ్, సోషల్ మీడియాపై తీవ్ర స్థాయిలో ఆధారపడటం ప్రస్తుతం భౌగోళిక రాజకీయ అస్థిరతల మధ్య సమస్యాత్మకమని జీటీఆర్ఐ నివేదిక వెల్లడించింది. అతిగా ఆధారపడటం వల్ల.. హఠాత్తుగా సేవలు లేదా డేటా నిలిపివేత ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుందని గుర్తు చేసింది. "అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌ల వంటి షాక్‌లను భారత్ ఎదుర్కొంటోంది. కానీ, దీనిని లోతుగా పరిశీలిస్తే.. డిజిటల్ అవసరాల కోసం అమెరికా టెక్నాలజీ సంస్థలపై ఆధారపడటం వల్ల వచ్చే ముప్పే తీవ్రమైందిగా కనిపిస్తోంది. ఒక వేళ అమెరికా వాటిని నిలిపివేయాలని ఆదేశిస్తే మాత్రం డిజిటల్ పేమెంట్లు, ట్యాక్స్ ఫైలింగ్స్ తీవ్రంగా ప్రభావితం అవుతాయి" అని పేర్కొంది. భారత ఫోన్లు, కంప్యూటర్లు, రక్షణ పరికరాలు, ప్రభుత్వ అప్లికేషన్లు అత్యధికంగా అగ్రరాజ్య సిస్టమ్స్ ఆధారంగానే పనిచేస్తున్నాయని వెల్లడించింది. భారత ప్రభుత్వం కచ్చితంగా 2030 నాటికి పూర్తిచేసేలా.. డిజిటల్ స్వరాజ్ మిషన్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఉందిని తెలిపింది. నాటి కల్లా సొంత ఆపరేటింగ్




సిస్టమ్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా వ్యవస్థలను సృష్టించుకోవాలని పేర్కొంది. చైనా, ఐరోపాలు ఇప్పటికే ఈ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాయని గుర్తు చేసింది. టెక్ సార్వభౌమత్వ సాధనలో భారత్ వెనకబడిపోతోందని తెలిపింది. భారత్ వద్ద ఉన్న అతిపెద్ద బలం ప్రజల డేటా అని.. దానిని వాణిజ్య చర్చల్లో పణంగా పెట్టకూడదని నివేదిక పేర్కొంది. భారత్‌లోని భారీగా ఉన్న వినియోగదారుల డేటా అమెరికాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, దానిమీద వచ్చే ఆదాయాలకు ఇంధనంగా మారుతుందని చెప్పింది. ఇది చమురు, రేర్‌ఎర్త్ మెటీరియల్ వలే భారత్‌కు వ్యూహాత్మక ఆస్తిగా అభివర్ణించింది.

## వలపు వల.. యోగా గురు విలవిల

**చేవెళ్ల :** ఓ ముఠా హనీట్రాప్ చేసి యోగా గురువు నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఓ వ్యక్తి యోగా ఆశ్రమం నిర్వహిస్తున్నారు. అనారోగ్యం పేరుతో ఇద్దరు మహిళలు ఆయన ఆశ్రమంలో చేరారు. కొన్నాళ్లుగా యోగా గురుతో సన్నిహితంగా మెలిగారు. వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు అతనికి తెలియకుండా వీడియోలు తీశారు. ఆ తర్వాత అమర్ అనే వ్యక్తి.. మహిళలతో సన్నిహితంగా ఉన్నప్పటి వీడియోలు చూపించి యోగా గురును బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. పలు దఫాలుగా రూ.50లక్షలు వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా మరో రూ.2కోట్లు ఇవ్వాలని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితుడు చేవెళ్ల పోలీసులను ఆశ్రయించడంతో అమర్ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.





## అస్సాంలో భూకంపం..

### 5.8 తీవ్రతతో ప్రకంపనలు

**అస్సాం :** అస్సాంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధెకియజులి ప్రాంతానికి 16 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5.కి.మీ లోతులో ఇది సంభవించిందన్నారు. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్టు సమాచారం. అయితే, ఇప్పటివరకు ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అస్సాంలోని ఇదే ప్రాంతంలో (సోనిత్‌పుర్‌లో) వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోదీ ప్రస్తుతం అస్సాం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే.

## రాహుల్‌పై ఆరోపణలపై విమర్శలు కాదు

### ఈసీ దర్యాప్తు చేయాలి : మాజీ సీఈసీ

**ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరును మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్. వై. ఖురేషీ వ్యతిరేకించారు. ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న రాహుల్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడానికి బదులు.. ఈసీ వాటిపై దర్యాప్తునకు ఆదేశించి ఉండాల్సిందని అన్నారు. ప్రతిపక్ష నేత స్థానంలో ఉన్న రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలు,



చేసిన ఆరోపణలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ఈసీకి ఉందని చెప్పారు. బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను నిర్వహించిన విధానాన్ని కూడా మాజీ ఎన్నికల కమిషనర్ తప్పుబట్టారు. సరైన విధంగా విధులు నిర్వహించకపోవడం వల్ల ఎన్నికల కమిషన్‌పై విమర్శలు వస్తుంటే మాజీ కమిషనర్‌గానే కాకుండా భారత పౌరుడిగానూ తాను తీవ్ర వేదనకు గురవుతానని ఖురేషీ అన్నారు. ఎన్నికల విషయంలో ఏం చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం అనే విషయాలను ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మన నిర్ణయాలను ప్రభావితం చేసే అన్ని శక్తులు, ఒత్తిళ్లను ఎదుర్కొనే విధంగా అధికారులు ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజల, ప్రతిపక్షాల విశ్వాసాన్ని గెలుచుకునేలా ఉండాలని ఆయన అన్నారు. ప్రతిపక్షాలతో మాట్లాడితేనే చాలా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. తాను ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో కూడా ప్రతిపక్షాలు తనను కలవడానికి వస్తే తప్పకుండా వారి వాదనలు వినేవాడినని చెప్పారు. ఎన్నికల సమయంలో తీసుకువస్తున్న కొత్త ఓటర్ల జాబితాలో కూడా ఎటువంటి తప్పులు లేవని మీరు అఫిడవిట్ ఇవ్వగలరా అని ఎన్నికల కమిషన్‌ను ఖురేషీ ప్రశ్నించారు. ఒకవేళ అందులో తప్పులు ఉన్నాయని తేలితే ఎన్నికల అధికారులు సైతం శిక్ష అనుభవించాల్సి వస్తుందని..దానికి మీరు సిద్ధమేనా అని ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఖురేషీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ.. రాజకీయ పార్టీలతో తాము క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని..ఇంత నిర్మాణాత్మక పద్ధతిలో మరెక్కడా సమావేశాలు జరగవని పేర్కొంది.



## నా మేధస్సు.. విలువ నెలకు రూ.200 కోట్లు

### నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ ఇటీవల పెద్దఎత్తున చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. దీని ద్వారా తాను వ్యక్తిగతంగా లబ్ధిపొందానంటూ వస్తోన్న విమర్శలపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఈ సందర్భంగా తన మేధస్సు.. విలువ నెలకు రూ.200 కోట్లని, డబ్బుకు ఎలాంటి లోటు లేదంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం నాగ్‌పుర్‌లో అగ్రికోస్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆలోచనలు రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తప్ప.. జేబులు నింపుకొనేందుకు కాదన్నారు. 'నేను డబ్బు కోసం ఇలా చేస్తున్నానని మీరు అనుకుంటున్నారా?.. నిజాయతీతో ఎలా సంపాదించాలో నాకు తెలుసు. నాకూ ఓ కుటుంబం, ఇల్లు ఉంది. నేను సాధువును కాదు.. రాజకీయ నాయకుడిని. రైతుల శ్రేయస్సు కోసం మా ప్రయత్నాలు కొనసాగుతాయి' అని పేర్కొన్నారు. ఇ20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా..? డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా..? అంటూ గతంలో పలు పోస్టులు నెట్టింట్లో చక్కర్లు కొట్టాయి. వాటిపై ఇప్పటికే కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ఆ భయాలన్నీ నిరాధారమైనవని పేర్కొంది. ఈ క్రమంలోనే ఇ20 పెట్రోల్ వాడకాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, న్యాయస్థానం దీన్ని కొట్టేసింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని, వాహన ఉద్గారాలను తగ్గించడం ఇంధన భద్రత, పర్యావరణ సంరక్షణ వంటి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని పేర్కొంది.



పండగలు సమీపిస్తున్నాయి. ఈ సమయంలో కొనుగోళ్లను పోత్సహించేందుకు పలు రాయితీలు అందుబాటులోకి వస్తుంటాయి. ఇదే సమయంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు అందుబాటులోకి వస్తుండటంతో చాలా సంస్థలు ఈసారి పండగల కొనుగోళ్లకు వెలుగులు వస్తాయని భావిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు క్రెడిట్ కార్డు సంస్థలూ ప్రయత్నిస్తున్నాయి. కొత్తగా కార్డులు జారీ చేసేందుకు పోటీ పడుతున్నాయి. పూర్తిగా ఉచితం అంటూ, ఆకర్షిస్తున్నాయి. మరి, ఈ మాటల్లో నిజమెంత? అని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దీనికోసం కొన్ని అంశాలను పరిశీలించాలి.

# క్రెడిట్ కార్డు ఉచితం కాదు

సాధారణంగా క్రెడిట్ కార్డులను జారీ చేసే సమయంలో బ్యాంకులు కొన్ని రుసుములను వసూలు చేస్తుంటాయి. స్టేట్‌మెంట్ ఫీజు, కార్డు పోతే కొత్త కార్డు ఇచ్చేందుకు ఫీజులాంటివి ఇందులో ఉంటాయి. వీటన్నింటి గురించి ఎక్కడా చెప్పరు. కానీ, కార్డు బిల్లులో వీటిని గమనించవచ్చు.

- క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించినప్పుడు, ఎలాంటి వడ్డీ ఉండదు. సాధారణంగా ఉచిత వడ్డీ కాలం 50 రోజుల వరకూ ఉంటుంది. ఇది పూర్తిగా మీ కార్డు బిల్లింగ్ తేదీపై ఆధారపడి ఉంటుంది. బిల్లు మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలి. ఆలస్యం చేస్తే రుసుముతోపాటు, వడ్డీ విధిస్తుంది.
- ప్రతి క్రెడిట్ కార్డుకూ గరిష్ఠ వినియోగ పరిమితి ఉంటుంది. ఒక బిల్లింగ్ సైకిల్‌లో ఆ మేరకే దాన్ని వినియోగించేందుకు వీలవుతుంది. కార్డుదారుడి క్రెడిట్ స్కోరు, చెల్లింపుల చరిత్ర, ఆదాయం, వినియోగ నిష్పత్తిలాంటివి పరిగణనలోకి తీసుకొని, పరిమితి నిర్ణయిస్తారు. తొలిసారి కార్డు తీసుకున్న వారికి ఇది కాస్త తక్కువగా ఉండొచ్చు. క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తూ ఉంటే, కొంత కాలం తర్వాత పరిమితిని పెంచే అవకాశం ఉంటుంది.




## ఏటీఎంలలో నగదు తీసుకోవచ్చు

- క్రెడిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంలలో నగదు తీసుకోవచ్చు. కానీ, దీనికి నెలకు 3-4 శాతం వరకూ వడ్డీ ఉంటుందని మర్చిపోవద్దు.
- జాగ్రత్తగా వాడితేనే క్రెడిట్ కార్డు మంచిది. నిర్లక్ష్యంగా ఉన్నామా.. అప్పుల ఊబిలోకి నెట్టేస్తుంది. వీలైనంత వరకూ అప్రమత్తంగా ఉండి, అన్ని వివరాలూ తెలుసుకున్నాకే, కార్డుతో కొనుగోళ్లు చేయండి. అప్పుడే మీకు ఇబ్బందులు లేకుండా పండగ షాపింగ్ పూర్తవుతుంది.

## గడువులోపు బిల్లును చెల్లించడమే మేలు



- చాలామంది మొత్తం బిల్లు చెల్లించకుండా.. కనీస బిల్లు మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఇది సాధారణంగా బిల్లులో 5 శాతం వరకూ ఉంటుంది. ఈ కనీస మొత్తాన్ని చెల్లించడం వల్ల క్రెడిట్ కార్డు అమల్లో ఉంటుంది. కానీ, మిగతా మొత్తానికి వడ్డీ తప్పదు. కాబట్టి, గడువులోపు మొత్తం బిల్లును చెల్లించడమే ఎప్పుడూ మేలు. ఒకవేళ పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు దాన్ని ఈఎంఐగా మార్చుకోవడం మంచిది.
- క్రెడిట్ కార్డు బిల్లు వచ్చినప్పుడు దాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఏం కొన్నారు? కొన్న బిల్లులూ.. స్టేట్‌మెంట్‌లో వచ్చిన మొత్తం సరిగానే ఉందా? వడ్డీ, రుసుముల్లాంటివి ఏమైనా ఉన్నాయా? సరి చూసుకోవాలి. లావాదేవీల్లో ఏదైనా వ్యత్యాసం ఉంటే, కార్డు సంస్థ దృష్టికి తీసుకెళ్లాలి.
- కార్డు బిల్లింగ్ తేదీలను జాగ్రత్తగా గమనించాలి. మీ కార్డు బిల్లు ఒక నెలలో రెండో తేదీన బిల్లింగ్ ముగిస్తే.. మూడో తేదీ నుంచి కొత్త బిల్లింగ్ ప్రారంభమవుతుంది. బిల్లింగ్ ప్రారంభంలో కొన్నప్పుడు మాత్రమే 50 రోజుల వ్యవధి లభిస్తుంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ వ్యవధి తగ్గుతుంది.
- రివార్డులు, నగదు వెనక్కి తదితరాలను పరిశీలించాలి. రివార్డు పాయింట్ల ద్వారా కొన్ని వస్తువుల కొనుగోలుపై రాయితీ లభిస్తుంది. ప్రయాణాల్లో, హోటల్ బుకింగ్‌లోనూ డిస్కౌంట్లు లభిస్తాయి. నగదు వెనక్కి ఆఫర్లు ఉన్నప్పుడు.. వెంటనే ఆ ప్రయోజనం లభిస్తుంది. కార్డుతో కొనేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.




## త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ :** త్వరలో బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను ప్రతిపాదించే బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బీమా రంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతో పాటు.. అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎఫ్‌డీఐ ప్రతిపాదిత బిల్లును రాబోయే శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా బీమా చట్టం 1938లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. వాటిలో బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లను ప్రస్తుత 74 శాతం నుంచి 100 శాతానికి చేర్చడంతో పాటు పెయిడప్ క్యాపిటల్‌ను తగ్గించడం, కాంపొజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధి చట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం, వారి ఆర్థిక భద్రతను పెంచడం, బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థల ప్రవేశాన్ని సులభతరం చేయడం, ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని పేర్కొన్నారు. దీపావళి పండగకు ముందే జీఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు ఈ సంస్కరణలను ప్రజలముందుకు తీసుకువచ్చి అనేక కుటుంబాలపై భారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు.

## కృత్రిమ మేధతో మెరుగైన అవకాశాలు



**ముంబయి:** టెక్నాలజీ రంగంలో మెరుగైన, కోరుకున్న ఉద్యోగ అవకాశాలు పొందేందుకు కృత్రిమ మేధ (ఏఐ) దోహదపడుతుందని అధిక శాతం మహిళలు విశ్వసిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలకు ఏఐ కీలక చోదకమని 78 శాతం మహిళలు వెల్లడించినట్లు ఉద్యోగాలు, కెరీర్ ప్లాట్‌ఫామ్ అప్నా.కో నివేదిక వెల్లడించింది. దేశంలోని టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న 11,300 మందికి పైగా మహిళల స్పందనల ఆధారంగా ఈ నివేదికను సంస్థ వెలువరించింది. ఇందులో పాల్గొన్న వారిలో 52% మంది జెన్ జెడ్ (25 ఏళ్లలోపు) కాగా.. దాదాపు 60 శాతం మంది ద్వితీయ, తృతీయ నగరాలకు చెందిన వారు. మూడింట రెండొంతుల మంది సాధారణ కాలేజీల్లో చదువుకున్నవారు ఉన్నారు.

- ఏఐ ఆధారిత భవిష్యత్ కోసం టెక్ రంగం సిద్ధమవుతోందని మహిళలు అభిప్రాయపడ్డారు. ఉద్యోగాలు, అధికారిక కార్యక్రమాలు, స్వతహాగా ఏఐ/ఎంఎల్ శిక్షణను 58 శాతం మంది ఇప్పటికే పొందుతున్నారు. త్వరలోనే శిక్షణ పొందడానికి సన్నాహాలు చేస్తున్నట్లు 24% మంది తెలిపారు. జెన్ జెడ్ మహిళల్లో (62%) శిక్షణ పొందాలనే భావన అధికంగా ఉంది. సాధారణ స్థాయి కళాశాలలకు చెందిన వారిలో ఇది 70 శాతంగా ఉంది.
- ఏఐ సాఫ్ట్‌వేర్ డెవలపర్లుగా ఎదగాలని సగానికి పైగా మహిళలు లక్ష్యంగా పెట్టుకున్నారు. తర్వాతి స్థానాల్లో డేటా సైన్స్, ఎంఎల్ కొలువులు (19%), ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ (14%), రీసెర్చ్ (10%) ఉన్నాయి. అధిక గిరాకీ ఉన్న ఉద్యోగాలకు మహిళలు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.
- దిగ్గజ కళాశాలలో విద్యను అభ్యసించడం కంటే ఏఐ నైపుణ్యాలు చాలా ముఖ్యమని దాదాపు మూడింట రెండొంతుల (64%) మహిళలు అభిప్రాయపడ్డారు.



## నాణ్యతలో ఇన్ని ఉల్లంఘనలా..

### బోయింగ్‌కు ఎఫ్‌ఏఏ మళ్లీ ఫైన్

ప్రముఖ వైమానిక రంగ దిగ్గజం బోయింగ్‌కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరో సారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన చాలా ఉల్లంఘనలను గుర్తించడంతో దాదాపు 3.1 మిలియన్ డాలర్లు (రూ.27.36 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబర్ 2023 నుంచి ఫిబ్రవరి 2024 లోపు చోటు చేసుకున్నవి. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడం సహా చాలా సంఘటనలున్నాయి. వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలో నిర్వహించిన దర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలు గుర్తించినట్లు ఎఫ్‌ఏఏ ప్రకటనలో పేర్కొంది. ఇక కెన్సాస్‌లోని బోయింగ్ సబ్‌కాంట్రాక్ట్ సంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పింది. రెండు విమానాలు ఎగిరేందుకు అయోగ్యమైనవిగా గుర్తించినట్లు పేర్కొంది. ఇక నాణ్యతలేని విమానానికి ధ్రువీకరణ వచ్చేట్లు సంతకం చేయాలని ఒత్తిడి చేసినట్లు గుర్తించారు. ఈ పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది. ఈ ఏడాది జూన్‌లో 'అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్' 17 నెలల పాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదల చేసింది. దీనిలో బోయింగ్ తయారీ, భద్రతా పర్యవేక్షణలో చాలా లోపాలు ఉన్నా.. ఎఫ్‌ఏఏ తనిఖీలు, ఆడిట్స్ ఏమాత్రం ప్రభావం చూపలేదని పేర్కొంది. ఫలితంగానే అలాస్కా ఎయిర్‌లైన్స్ ఘటన చోటు చేసుకొందని వెల్లడించింది. జనవరి 2024 ఘటన విచారకరమని బోయింగ్ ఓ ప్రకటనలో పేర్కొంది. తమ భద్రతా ప్రమాణాలను బలోపేతం చేసుకొంటామని పేర్కొంది. నాణ్యత, బాధ్యతలకు సంబంధించి చర్యలు చేపడతామని చెప్పింది.



## పేద కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ తోడ్పాటు

**ఖమ్మం జిల్లా బ్యూరో, రాజముద్ర న్యూస్, సెప్టెంబర్ 14 :** తిరుమలాయపాలెం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తిరుమలాయపాలెం మండల పరిధిలో ఆగస్టు 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు మరణించిన కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున ఆదివారం ఆర్థిక సాయం అందజేసింది. తిరుమలాయపాలెం, పిండిప్రోలు, తెట్టెలపాడు, కేశవాపురం, అజ్మీర్ తండా, హైదర్ సాయిపేట, జోగులపాడు, చంద్రు తండా, పాతర్లపాడు, దమ్మాయి గూడెం, ఏలూవారిగూడెం, బీరోలు, బచ్చోడు, బచ్చోడు తండా, జూపేడ, సోలీపురం, కాకరవాయి, సుద్దవాగు తండా, రఘునాధపాలెం, హస్నాబాద్, సుబ్లేడు, ఇస్లావత్ తండా, మహ్మదాపురం, మేడిదపల్లి, తాళ్లచెర్వు, ఎర్రగడ్డ, కొక్కిరేణి గ్రామాల్లోని 70 కుటుంబాలకు ఈ సాయం అందజేయబడింది. కష్టకాలంలో పేదలకు అండగా నిలిచే ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు.



## ప్రీ ప్రైమరీ పియం శ్రీవిద్యను అంగన్వాడీలకు అప్పచెప్పాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

**ఖమ్మం జిల్లా బ్యూరో, రాజముద్ర న్యూస్, సెప్టెంబర్ 14 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వస్తున్న ప్రీ ప్రైమరీ పి యం శ్రీ విద్య ను అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలి అంగన్వాడీ టీచర్లు హెల్పర్స్ కు అప్పచెప్పాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలి అంగన్వాడీ లకు పిలుపు ఇచ్చారు. అంగన్వాడీ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆరెంపుల సెక్టార్ మహాసభ ఆరెంపులలో పద్మ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సోమవారం రోజున రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు ఇల్లు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబరు 25న చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్ రావు ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు. జిల్లా నాయకులు భాగ్యమ్మ సరిత పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులు గా శ్రీలత కార్యదర్శి గా బాగ్యమ్మ ఎన్నికైనారు.



## సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకి కాశీనాథం ఫంక్షన్ హాల్ శ్రీనివాస థియేటర్ పక్కన జరుగు సభకు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు బుధవారం జిల్లా జిల్లా కేంద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయం ధర్మభిక్ష%శీ% భవనంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు కుటుంబంలో జన్మించిన సుధాకర్ రెడ్డి వారి పెద్దనాన్న తండ్రి వారసత్వంతో ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షింపబడినడని 83 సంవత్సరాలు సంపూర్ణంగా జీవించిన ఆయన 2025 అక్టోబర్ 22న భౌతికంగా మన నుంచి దూరమయ్యారని అన్నారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు విధానాలకు నీతి నిజాయితీగా చివర వరకు అంకితభావంతో పాటుపడిన మహానేత వారి జీవితాన్ని అంకితం చేసిన దాతృమూర్తి చివరకు తన భౌతికాయాన్ని పరిశోధన నిమిత్తం వైద్యశాలకు అప్పగించారని అన్నారు. ఆయన విద్యార్థి, యువజన రైతు కార్మిక పౌర హక్కుల నాయకుడిగా ఎన్నో బాధ్యతలు జాతీయ స్థాయిలో నిర్వహించారని కొనియాడారు ఈ సంతాప సభకు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంతాప సభకు భారీ నీటిపారుదల శాఖ మాత్యులు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు కావున జిల్లా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చేపూరి కొండలు, పట్టణ కార్యవర్గ సభ్యులు పెండ్ర కృష్ణ, నాయకులు వాడపల్లి వెంకన్న, గురు స్వామి తదితరులు పాల్గొన్నారు.


## వ్యభిచార గృహంపై పోలీసుల మెరుపు దాడి



**ఖమ్మం జిల్లా బ్యూరో రాజముద్ర న్యూస్ సెప్టెంబర్ 14 :** బోనకల్ మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో నిమ్మతోట మంగమ్మ గృహంలో వ్యభిచారం జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, స్థానిక ఎస్సై పొదిలి వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో విటుడు, బాధిత మహిళ, నిర్వాహకురాలు మంగమ్మ ఉన్నట్లు తెలిపారు, ఈ సందర్భంగా ఎస్సై వెంకన్న మాట్లాడుతూ ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## జాతీయ రహదారుల నిర్మాణ పనుల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం జిల్లా బ్యూరో, రాజముద్ర న్యూస్, సెప్టెంబర్ 14 :** జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా పూర్తవడానికి మిగులు భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం-దేవరపల్లి, నాగపూర్-అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం-దేవరపల్లి రహదారికి ధాంసలాపురం వద్ద ఎంట్రీ, ఎక్జిట్ పాయింట్ కొరకు 6.22 ఎకరాల భూసేకరణ చేయాలన్నారు. ఇందులో 3.16 ఎకరాలకు ఇప్పటికే అవార్డ్ పాస్ చేసినట్లు, మిగతా 3.06 ఎకరాలకు భూసేకరణ కు చర్యలు వేగవంతం చేయాలన్నారు. మేజర్ బ్రిడ్జి, వియుపి లు ఈ నవంబర్ లోగా, ఆర్ఓబి డిసెంబర్ లోగా పూర్తి చేయాలన్నారు. కొదుమూరు వద్ద 400 కెవి ఇహెచ్ టి షిఫ్టింగ్ పనులు రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు సమావేశమై పూర్తిచేయాలన్నారు. నాగపూర్-అమరావతి ప్యాకేజి-1 మరియు 2 భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ లోగా పరిహార చెల్లింపులు పూర్తిచేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎన్ హెచ్ఏఐ పిడి లు రామాంజనేయ రెడ్డి, దివ్య, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వీర తెలంగాణ సాయుధ పోరాటంకు వారసులు కమ్యూనిస్టులే

### సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్




**ఖమ్మం జిల్లా బ్యూరో, రాజముద్ర న్యూస్, సెప్టెంబర్ 14 :** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో గజ్జల వెంకటయ్య భవనములో సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం కొత్తపల్లి వెంకన్న అధ్యక్షతన జరిగింది ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పాల్గొని ప్రసంగించారు.. బండి రమేష్ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వారసులు నిజమైన వారు కమ్యూనిస్టులని వారి ఆధ్వర్యంలో సాగిన పోరాటంలో నాలుగు వేల గ్రామాలను విముక్తి చేసి గ్రామ రాజ్యాలు స్థాపించారని నాలుగు లక్షల ఎకరాలను పేదలకు భూమి పంచారని దొరల పై దండిత్తి ఆత్మగౌరవాన్ని చాటిన మహోత్తర పోరాటమని ఆ యొక్క పోరాటంలో పాల్గొనని వారు ఈరోజు మేము వారసులని చెప్పుకోవటం సిగ్గుచేటని,, ఏనాడు బిజెపి గానీ దాని అనుబంధ సంస్థలు ఈ ఉద్యమంలో పాల్గొనలేదని,, ఈ యొక్క పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా అభివర్ణించటం దారుణం అని ఆనాడు సాయుధ పోరాటంలో ముగ్ధం మొహిద్దిన్ షోయబుల్లాఖాన్ అనేకమంది ముస్లిం యోధులు పాల్గొన్నారని ఇది వర్గ పోరాటంగా జరిగింది తప్ప హిందూ ముస్లిం పోరాటం కాదని గడగడలాడించిన మహోత్తర పోరాటమని దొరలకు పేదవాడికి జరిగిన వర్గ పోరాటమని ఇది హిందూ ముస్లిం పోరాటం చూపటం అన్యాయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 17న సాయంత్రం వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ ఖమ్మం భక్తురామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని ఈ యొక్క సభకు ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ పాల్గొంటున్నారని ఈ సభకు పెద్ద ఎత్తున ప్రజలు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.. ఈ యొక్క కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ డి బసీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, తుళ్లూరు నాగేశ్వరరావు, దాసరి మహేందర్, వర్షపు వీరన్న, బింగి రమేష్, బండారి సైదులు, వెంకటేష్ రావుల, విజయ్పాల్ రెడ్డి, సోమనబోయిన అంజి, దొడ్డలింగస్వామి, కొమ్ము నాగేశ్వరరావు, బానోత్ బాలు పల్లి రమేష్, తంగేళ్ల రమేష్, దొండేటి నిర్మల్, రోడ్ ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు గాదె వరుణ్ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అన్ని శ్రీను పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- రాచరికం రద్దుకై జరిగిన ప్రజాపోరాటానికి మతమురంగు పులమ వద్దు
- ఆనాటి కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాటాలు లేకుండా విలీనం జరిగేదా
- సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, నియోజకవర్గం ఇన్చార్జి కె రామస్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ....నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ భూస్వామ్య గులాం గిరికి, అణచివేత, దోపిడీలకు, వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు బాంచన్ కాల్మొక్త నుండి దొర ఏందిరో నీ దొర తనం ఏందిరో అంటూ బందూకులు పట్టిన కమ్యూనిస్టుల పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రభులింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, శంకర్ పల్లి మండల పార్టీ కార్యదర్శి సుధీర్, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కె శ్రీనివాస్, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి పి శ్రీశైలం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్, వడ్ల మంజుల, గ్రామ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, మహిళా సంఘం పార్టీ శ్రేణులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

## టీజీఈ హైట్స్ ప్రాజెక్టును విజయవంతం చేయండి



**ఖమ్మం జిల్లా బ్యూరో రాజముద్ర న్యూస్ సెప్టెంబర్ 14 :** పోలేపల్లి లోని రాజీవ్ స్వగృహ సముదాయం నందు ప్రభుత్వ ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీకి టెండర్ దక్కినందుకు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క మల్లు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు సహకారంతో ప్రభుత్వ ఉద్యోగులకు అతి తక్కువ ధరలో గృహ సదుపాయం కల్పించాలని సదుద్దేశంతో ఈ ప్రాజెక్టును సాధించుకున్నామని ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పోలీస్ డిపార్ట్మెంట్ హోంగార్డులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. హైదరాబాదులో ఉన్న ఐ రైజ్డ్ బిల్డింగ్స్ కు సరి సమానంగా ఈ ప్రాజెక్టును ఒక మోడల్ ప్రాజెక్టుగా రూపొందించి సంవత్సరంలోపే పూర్తి చేసి ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా ఈ రాజీవ్ స్వగృహ సముదాయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులైన ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ,గెజిటెడ్, నాన్ గెజిటెడ్, పంచాయతీరాజ్, రెవిన్యూ, శాఖలతో పాటు పోలీస్ శాఖ వారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని దానితోపాటు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగులైన ఎల్ఐసి, బ్యాంకింగ్, సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, కె.టి.పి.ఎస్, జెన్కో, ఎఫ్.సి.ఐ కి చెందిన అన్ని రంగాల ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక ఒరవడి కలిగిన ఖమ్మం జిల్లాలో ఉద్యోగ కమ్యూనిటీ అంతా ఒకే ప్రాంతంలో ఉండే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించి ఆదర్శవంతంగా ఉండేలా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు...ఎస్బీఐ రిలేషన్ షిప్ మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ ఎస్బీఐ బ్యాంకు లోన్ ఎలిజిబిలిటీ ఉన్నా వారందరికీ లోన్ ఇస్తామని,హౌసింగ్ లోన్ కు సంబంధించి సందేహాలు కి వివరణా ఇచ్చారు .ఈ రోజు 26 మంది ఎన్రోల్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదేన శ్రీనివాస్ , టీజీ ఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ సెక్రటరీ విజయ్ కుమార్, శేష్ ప్రసాద్, రాంబాబు, పుష్ప రాజ్, మాధవరావు,వేల్పుల శ్రీను,వెంకటేశ్వర్లు, టిఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జెడ్, ఎస్ .జైపాల్ విజయకుమార్,ఎర్ర రమేష్, తాళ్లూరి శ్రీకాంత్,పెద్దినేని రాధాకృష్ణ, పి ఆర్ టి యు జిల్లా మాజీ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో ప్రశాంతంగా లైసెన్స్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం జిల్లా బ్యూరో రాజమద్ర న్యూస్ సెప్టెంబర్ 14 :** జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ బిజీఎన్ఆర్ కళాశాలలో ఇట్టి పరీక్షలు చేపట్టినట్లు అన్నారు. ఉదయం సెషన్ లో చేపట్టిన థియరీ పరీక్షకు 129 మంది అభ్యర్థులకు గాను 128 మంది అభ్యర్థులు హాజరు కాగా, ఒకరు గైర్హాజరు అయినట్లు,మధ్యాహ్నం నిర్వహించిన ప్లాటింగ్ పరీక్షకు 205 మంది అభ్యర్థులకు గాను 202 మంది హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, సిపిఓ ఏ.శ్రీనివాస్ లు చేపట్టారని కలెక్టర్ అన్నారు.



## ఘనంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** మాజీ మంత్రి సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదినం కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు గొప్ప పండుగని ప్రజలందరూ కూడా ఎంతో సంతోషంగా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలలో దామన్న పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సూర్యాపేట కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాం రెడ్డి దామోదర్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆయన కొండంత అండగా నిలిచారని,తన సుదీర్ఘ రాజకీయ జీవితమంతా కాంగ్రెస్ పార్టీలోనే ఆయన గడిపి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలి,మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ, కుంభం రాజేందర్,సాజిద్,ఆలేటి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



## సంతాప సభకు హాజరైన చలసాని

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సీనియర్ జర్నలిస్టు ప్రముఖ న్యాయవాది బంటు కృష్ణ మాతృమూర్తి బుచ్చమ్మ సంతాప సభకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన టి యు డబ్ల్యూ జే(ఐజే యు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు,యూనియన్ ప్రతినిధులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రపంచ దేశాలకు ఆదర్శంగా సనాతన ధర్మం

### మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** ప్రపంచ దేశాలకు ఆదర్శంగా సనాతన ధర్మం నిలుస్తోందని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తెలిపారు ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్లో సనాతన ధర్మ పరిరక్షణ ఆలయన్స్ కమిటీ ఆధ్వర్యంలో దేవాదాయ ధర్మాదాయ ఆధ్యాత్మిక సంఘాల ఐక్యత,స్వామీజీలు పీఠాధిపతులు గురూజీలతో సనాతన ధర్మంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నో ఏళ్లుగా సనాతన ధర్మం విరాజిల్లుతుందని కొనియాడారు. దేశ నలుమూల నుంచి వచ్చిన వివిధ స్వామీజీలు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాషాయానికి విలువ పెరుగుతోందని కొనియాడారు. మహా కుంభమేళాలో 15 కోట్ల మంది హిందువులు పాల్గొన్నారని కొనియాడారు. హిందువులలో ఉన్న అనైక్యత కారణంగా సనాతన ధర్మం సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల్లో ఉన్న అంతర్ యుద్ధాన్ని వదులుకొని సనాతన ధర్మం కొరకు కృషి చేయాలన్నారు. హిందువుల ఏకైక ఆయుధం నాలుక అని,ఇతర మతస్తుల వల్ల జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ప్రతి హిందువు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ బీరెల్లి చంద్రారెడ్డి,మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు,సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ ,మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగ యాదవ్ ,మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ,జాతీయ స్వామీజీ, పీఠాధిపతి సాధువుల అధ్యక్షులు అంబికేశ్వరానంద స్వామీజీ, కక్కిరేని చంద్రశేఖర్,రాచర్ల కమలాకర్,ఈగ దయాకర్, బ్రాహ్మణపల్లి మురళీధర్,నూకా వెంకటేశం గుప్తా,రాచర్ల వెంకటేశ్వరరావు,తోట శ్యాంప్రసాద్,పగిళ్ల సుమిలా చంద్రారెడ్డి,సలిగంటి వీరేంద్ర, చలమల్ల నరసింహ,శ్రీపాద లక్ష్మణ చారి బోనగిరి ఉష శ్యాం ప్రసాద్, బీరెల్లి కిరణ్ కుమార్ రెడ్డి,తాడూరి నరసింహ చారి గుమ్మడవెల్లి శ్యామ్,నమిలిపురి నరేందర్, రమణారెడ్డి,దాచేపల్లి శైలజ, సంధ్య,రాచర్ల లక్ష్మి, సువర్ణ , సునీత,లలిత,స్వామీజీలు శివ రుద్ర స్వామి,సోమేశ్వర స్వామి భువనేశ్వర్ అగోరి,రుద్ర శివ మౌన సరస్వతి స్వామి యోగా సాధకుల తో పాటు సుమారు 50 మంది స్వామీజీలు పాల్గొన్నారు.



## కోట్ పల్లి మండలంలో
# కల్లులో తోక పరుగులు
### ఆగ్రహించిన గ్రామస్తులు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గ్రామాలలో రైతులు పంట పొలంలో పనిచేసే సాయంకాలం అయిన సమయంలో సేద తీర్చుకునేందుకు ధూప పేరుతో కల్లు కాంపౌండ్‌లోకి వెళ్లి కల్లు తాగి రోజంతా చేసిన కష్టాన్ని మరిచిపోయేలా జీవిస్తూ ఉంటూ ఉన్న తరుణంలో వికారాబాద్ జిల్లా పరిధిలోని కోట్ పల్లి మండలంలో కల్లులో తోక పురుగులు రావడం సంచలనంగా మారింది. కల్లులో తోక పురుగులు రావడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండల పరిధిలోని మొతుకుపల్లి గ్రామంలో కల్లులో తోక పరుగులు తేలడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు వ్యాపారి వద్ద నిల్వ ఉంచిన కల్లులో తోకపురుగులు కనిపించడంతో కల్లు పాత్రలను గ్రామస్తులు పారబోసేశారు. కల్లును శుభ్రంగా అందించడం వ్యాపారుల బాధ్యత కానీ మాకు అందుతున్న కల్లులో తోక పురుగులు ఉండటం ఆరోగ్యానికి హానికరమని అన్నారు. ఇలాంటి నిర్లక్ష్యం సహించబోము అని హెచ్చరించారు. ఈ ఘటనపై కల్లు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో శుభ్రమైన కల్లు మాత్రమే అందేలా చూడాలని ఎక్సైజ్ అధికారులను గ్రామస్తులు కోరారు. సంబంధిత అధికారులు గ్రామాలలో ఉన్న కల్లు దుకాణాలను తనిఖీ చేసి నాణ్యత కలిగిన కల్లును ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు ఏం తోచనట్లు వ్యవహరిస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాణ్యతలేని కల్లు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో కూడా పర్యటించి పరిశీలించాలని కోరారు.



## పద్మావతి కాలనీ ఫేస్-2
# నూతన కార్యవర్గం ఎన్నిక

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మావతి కాలనీ ఫేస్ 2, నూతన కార్యవర్గం ఆదివారం ఉదయం కాలనీ సర్వ సభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత కమిటీ కాల పరిమితి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోవడం జరిగినది. నూతన కమిటీ సభ్యులు: గౌరవ అధ్యక్షుల బెజడి బ్రహ్మం, అధ్యక్షులు బద్ధం మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుర్ర అమర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్టిపాటి సబ్రహ్మణ్యం, కోశాధికారి జి. విజయ్ సింగ్, సంయుక్త కార్యదర్శి ఇంద్రగంటి వెంకటాచారి, చౌద వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైసర్ పెరుమాళ్ స్వామి, అడ్వైజర్ సుబ్బా రావు, కార్యవర్గ సభ్యులు: కాస రాజు, నైనాకంటి లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులను ఎన్నుకోవడానికి పాల్గొన్న కాలనీ వాసులకు, నూతన కమిటీ సభ్యులకు బెజడి బ్రహ్మం శుభాకాంక్షలు తెలిపారు.



## నందకుమార్ యాదవ్ నివాసానికి విచ్చేసిన
# బండారు దత్తాత్రేయ



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ నందకుమార్ యాదవ్ సతీమణి అనురాధ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసుకున్న కేంద్ర మాజీ మంత్రి, హిమాచల్ ప్రదేశ్, హర్యానా రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శేరిలింగంపల్లి గ్రామం రేయిన్ ట్రీ అబాడ్ లోని నందకుమార్ యాదవ్ ఇంటికి వచ్చి వారిని పరామర్శించారు. అనురాధ త్వరగా కోలువాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతకింది గోవర్ధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి, నాయకులు రాఘవేందర్ రావు, శాంతిభూషణ్ రెడ్డి, విజయలక్ష్మి, రమణీయమ్మ, రాధ మూర్తి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ యాత్రలో రసానుభూతి

**పాలకుర్తి, రాజముద్ర న్యూస్:**

**"మహాకవే!నమోస్తుతే"**
**(పాలమూరు జిల్లా కవుల సాహితీ యాత్రాచరిత్ర) పుస్తకం అందుకున్నాను. పుస్తక సంపాదక వర్గంలోని డా. శంకరమంచి శ్యాంప్రసాద్ కు ప్రత్యేక ధన్యవాదాలు. పాలమూరు జిల్లా సాహిత్యాభిలాషకులు ఓరుగల్లు సాహితీయాత్రను చేయడం శుభదాయకం. ఆ యాత్రానుభవాలను చరిత్ర పుటలలో నిలచిపోయేట్లు మలచడం మరొక విశేషం.1838లో ఏనుగుల వీరస్వామి రాసిన 'కాశీయాత్ర చరిత్ర' తో తెలుగు యాత్రాసాహిత్యం మొదలైనట్లుగా సాహితీపండితుల అభిప్రాయ-ంమైకూడవుంది.**




"ఓరుగల్లు పొరుగల్లు" ఈ పదం నగర ఘనచరిత్రకు ప్రామాణిక నిదర్శనం. శాతవాహనుల కాలం నుండి ఆసీఫ్ జాహీల కాలంవరకు చరిత్ర క్రమంలో ఓరుగల్లు నిలిచిఉంది. సాహిత్యభిలాషకుల మూలాలు కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్నాయన్న విషయం గమనించ వచ్చు. రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి నడయాడిన నేల వల్మిడి జనగామ జిల్లాలోనిదే. పాలకుర్తి మండల పరిధిలోని గూడూరులో విరియాల మల్లభూపతి వేయించిన 1124 శాసనం నందున్నవి "తొలి తెలుగు వృత్త పద్యాలు" (3 చంపకమాలలు, ఉత్పలమాలలు) గుర్తింపు పొందినవి.తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాధుడు (13వ శతాబ్దం)జాను తెనుగుకవిగా ప్రసిద్ధి, 'బసవపురాణం'తొలి దేశి (ద్విపద) పురాణం వీరిదైనది.భాగవత అనువాదకర్త బమ్మెర పోతన (15వ శతాబ్దం)' తెలుగుల పుణ్యపేటి' గా కీర్తనీయులు.

వీరి ఇరువురితోనే మునుముందుగా ఈ ప్రాంతం సాహిత్య వాతావరణానికి దోహదపడిందని చెప్పవచ్చు. ఆధునికయుగంలో అన్నిప్రక్రియల్లోనూ సిద్ధహస్తులైన సాహితీ మూర్తులు ఎందరో ఇక్కడి నేలలో ఉద్భవించి సాహితీరంగాన్ని దీప్తిమంతం చేశారు, చేస్తున్నారు. అలాంటి వారిలో వానమామలై వరదాచార్యులు, కాళోజి నారాయణరావు, బిరుదరాజు రామరాజు, దాశరథి కృష్ణమాచార్యులు, దాశరథి రంగాచార్య వీరందరి జన్మస్థలాలైన మడికొండ, హన్మకొండ, చిన్న గూడూరు, పాలకుర్తి, వల్మిడి, బొమ్మెర, గూడూరు ప్రాంతాలను సందర్శించడం సందర్శకుల అదృష్టంగా భావించవచ్చు. మహాకవులు నడయాడిన నేలను దర్శించి, తరించిన అనుభవాలు, పొందిన అనుభూతులను పాలమూరు జిల్లా సాహిత్యాభిలాషకులు అక్షరబద్ధం చేసినందుకు సంతోషం. పుస్తకం లోపల పరిమళాల అనుభూతుల ఆస్వాధనను అద్దిన వారిలో.. పల్లెర్ల రామమోహన్ రావు, డా. శంకర మంచి శ్యాంప్రసాద్, రాజశేఖర శర్మ, తిరుపతమ్మ, అనితాకుమారి, పుట్టి గిరిధర్, శివశంకర్, నరేష్, తిరుపతయ్య, సుజాత, కట్టా అనిత, కెవిజికె ఆచార్య, రుమాళ్ళ ఉమాదేవి, డా. పుష్పలత, సువర్ణ, పుష్పలత, శ్యాంప్రసాద్ రావు, చంద్రమౌళి, శ్వేత, శ్రీదేవి, నీరజ, బలరాంగౌడ్, కట్టా గిరిజారమణ శర్మ అభినందనీయులు. ఈ అందమైన జ్ఞాపికలో ముందు మాటలతో కనిపించేవారు. పెద్దలు నాగిళ్ళ రామశాస్త్రి, డా.అంపశయ్య నవీన్, విశ్రాంత ఆచార్యులు బన్న అయిలయ్య, డా.దహగాం సాంబమూర్తి, వి.ఆర్.విద్యార్థిలకు రుణపడిన కృతజ్ఞతలు అనేకం ఉన్నాయి. ఈ యాత్రా పుస్తకంలో తెలుగు భాషాభిమానులు,పండితులు రాసిన అనుభవాలను చదువుతుంటే మనం కూడా వారికి పరిచయస్తులమై వారివెన్నంటే నడుస్తూ.. రెండు రోజులను అనుసరించిన ఆ రసానుభూతిని ఆస్వా దించగలం. పుస్తకం 170 నుండి175 పేజీలల్లో 'వార్తా కదంబం'లో మన పేరును వెతుక్కోవాలనిపిస్తుంది. అలాగే చివర్లోని 'చిత్ర కదంబం' లో మన చిత్తర్వు కూడా ఉంటే బావుండునేమో అనిపించక మానదు. స్వాగతించిన దారివెంట చిక్కటి చీకటిలో వెను తిరిగి మరలిపోతున్న బస్సు చిరువెలుగును ప్రసరించక మానదు మన మనస్సులో.. సాహిత్య యాత్రాభిలాషకులందరి వద్ద ఉండవలసిన పుస్తకమిది. ఈ సాహితీయాత్రకు సారథ్యంవహించిన పల్లెర్ల రామమోహన రావు, డా. శంకరమంచి శ్యాంప్రసాద్, యూట్యూబ్ ఛానల్ కెవిజికె ఆచార్యులు ఆదర్శప్రాయులు. పుస్తకం కూర్పునకు సంపాదకులుగా వ్యవహరించిన పల్లెర్ల రామమోహన రావు, కట్టా గిరిజారమణ శర్మ, శంకర మంచి శ్యాంప్ర సాద్ కృతకృత్యులైనారని విశ్వసిస్తు. పల్లెర్ల రామమోహనరావు "భాగవత నీతి పద్యము లు" పుస్తకావిష్కరణ కార్యక్రమం 2020 లో బొమ్మెరలో జరిగిన సందర్భంగా గూ డూరు పోతన చైతన్య వేదిక తరపున నేను వెళ్ళినపుడు వారి పరిచయం జరిగింది.



**– పాలడుగు రత్నాకర్ రావు**




## రజాకార్ల నిరంకుశత్వాన్ని ఎదిరించిన
# అమరవీరులను స్మరించుకోవాలి
### తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ

- పనిలో ఐక్యత, స్వేచ్ఛలో గౌరవం సర్దార్ పటేల్ దేశానికి ఇచ్చిన కానుక తెలంగాణ గవర్నర్
- హైదరాబాద్ విమోచన దినోత్సవ సందర్భంలో అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది : కిషన్ రెడ్డి
- హైదరాబాద్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన 'హైదరాబాద్ విమోచన దినోత్సవ ఫోటో ఎగ్జిబిషన్'ను ప్రారంభించిన తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :** హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ""పనిలో ఐక్యత, స్వేచ్ఛలో గౌరవం సర్దార్ పటేల్ దేశానికి ఇచ్చిన కానుక" అని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 17వ తేదీకి గల చారిత్రక ప్రాముఖ్యతను వివరిస్తూ... హైదరాబాద్ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాలని గవర్నర్ విజ్ఞప్తి చేశారు. "హైదరాబాద్ రాష్ట్రం భారతదేశ ఆత్మలో విలీనమైన రోజు అది. రజాకార్ల నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ హైదరాబాద్ ప్రజలు దృఢంగా నిలిచారు. వారు పోరాటం చేశారు, అనేక బాధలుపడ్డారు. చివరికి విజయం సాధించారు. వారి జ్ఞాపకాలను గౌరవించడం.. వారి కథను భవిష్యత్ తరాలకు అందించడం మన పవిత్ర కర్తవ్యం" అని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ విముక్తి ఉద్యమంలో భాగమైన చారిత్రక సంఘటనలు, పోరాట యోధుల వ్యక్తిత్వాలను వర్ణిస్తూ సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన రాష్ట్రంలోని పౌరులందరికీ చేరాలని జిష్ణు దేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ రూపొందించిన "లిబరేషన్ ఆఫ్ హైదరాబాద్ సంస్థాన్" వర్చువల్ ఎగ్జిబిషన్ ను గవర్నర్ ప్రారంభించారు. సాలార్ జంగ్ మ్యూజియం సహకారంతో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం (ఎన్‌సీఎస్‌ఎమ్) అభివృద్ధి చేసిన ఈ గ్యాలరీ నిజాం పాలనను, నాటి సామాజిక-ఆర్థిక పరిస్థితులు, ఉప్పొంగిన జాతీయవాదం, హైదరాబాద్ సంక్షోభం, ఆపరేషన్ పోలో, ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ విలీనమైన చరిత్రనంతా వివరంగా ప్రదర్శించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ.. హైదరాబాద్ ఏకీకరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన నిర్ణయాత్మక పాత్రను గుర్తు చేసుకున్నారు. "హైదరాబాద్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరిగినప్పటికీ, ఆపరేషన్ పోలో ద్వారా సర్దార్ పటేల్ భారత్‌లో విలీనం అయ్యేలా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడానికి, ప్రతియేటా విమోచన దినోత్సవాన్ని నిర్వహించడానికి కట్టుబడి ఉంది" అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్ రావు, పీఐబీ-సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణ కాంత్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సమర్ నందా, ఇతర స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన దాదాపు 50 ప్యానెళ్లతో కూడిన నాలుగు రోజుల ప్రదర్శన ఈ నెల 14 నుంచి 17 వరకు నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రజల సందర్శన కోసం తెరిచి ఉంటుందని అన్నారు.





# చిరకాల ప్రత్యర్థి చిత్తు

## పాక్‌పై భారత్ ఘనవిజయం

## విజృంభించిన కుల్‌దీప్, బుమ్రా, అక్షర్

**దుబాయ్ :** పాకిస్థాన్‌తో మ్యాచ్ వద్దంటూ ఓవైపు దేశవ్యాప్తంగా నిరసన స్వరాలు కొనసాగుతుండగానే, ఆసియా కప్ టీ20 టోర్నీలో ఆ జట్టుతో తలపడ్డ టీమ్‌ఇండియా.. ప్రత్యర్థిని చిత్తుగా ఓడించి తన ఆధిపత్యాన్ని చాటింది. ఆదివారం పాక్‌పై 7 వికెట్ల తేడాతో నెగ్గిన భారత్ సూపర్-4లో స్థానాన్ని ఖాయం చేసుకున్నట్లే. భారత బౌలర్లు సమష్టిగా విజృంభించంతో మొదట పాక్ 9 వికెట్లకు 127 పరుగులే చేయగలిగింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన కుల్‌దీప్ యాదవ్ (3/18)కు తోడు అక్షర్ పటేల్ (2/18), బుమ్రా (2/28), వరుణ్ చక్రవర్తి (1/24)ను పాక్‌ను దెబ్బ తీశారు. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (40, 44 బంతుల్లో 1x4, 3x6), టెయిలెండర్ షహీన్ షా అఫ్రిది (33 నాటౌట్, 16 బంతుల్లో 4x6) పోరాడకుంటే పాక్ ఆ మాత్రం స్కోరైనా చేసేది కాదు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (47 నాటౌట్, 37 బంతుల్లో 5x4, 1x6), అభిషేక్ శర్మ (31, 13 బంతుల్లో 4x4, 2x6), తిలక్ వర్మ (31, 31 బంతుల్లో 2x4, 1x6) మెరుపులతో లక్ష్యాన్ని భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. భారత్ కోల్పోయిన మూడు వికెట్లూ స్పిన్నర్ సయిమ్ అయూబ్ (3/35) ఖాతాలోకే చేరాయి. టీమ్‌ఇండియా శుక్రవారం తన చివరి లీగ్ మ్యాచ్‌లో ఒమన్‌ను ఢీకొంటుంది.

### వికెట్లు పడ్డాయి కానీ..:

ఛేదనలో పాక్ మూడు వికెట్లయితే తీసింది కానీ.. భారత్‌ను పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. ఆ జట్టుకు ఏ దశలోనూ కాస్తయి నా విజయావకాశాలు కనిపించలేదు. పాక్ ప్రధాన బౌలింగ్ అస్త్రమైన షహీన్ అఫ్రిది వేసిన ఆరంభ ఓవర్లో తొలి రెండు బంతులను 4, 6గా మలిచిన అభిషేక్ శర్మ.. ఛేదన ఎలా సాగబోతోందో సంకేతాలు ఇచ్చాడు. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (10) కూడా దూకుడుగానే బ్యాటింగ్ ఆరంభిం చాడు. స్పిన్నర్ అయూబ్ వేసిన రెండో ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. కానీ అదే ఊపులో ముందుకొచ్చి షాట్ కొట్టబోయి స్టంపౌటైపోయాడు. కానీ మరో ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రం పాక్ బౌలర్లను శిక్షించడం ఆపలేదు. దీంతో నాలుగో ఓవర్లోనే స్కోరు 40 దాటేసింది. కానీ అతను కూడా అయూబ్ వేసిన తర్వాతి ఓవర్లో ఔటైపోయాడు. తర్వాత తిలక్ వర్మ, సూర్యకుమార్ ఆచితూచి ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. కుదురుకున్నాక ఇద్దరూ చక్కటి షాట్లు ఆడారు. 12 ఓవర్లలో 97/2తో భారత్ విజయానికి చేరువైంది. అప్పటికే నవాజ్ బౌలింగ్‌లో ఔటయ్యే ప్రమాదాన్ని తప్పించుకున్న తిలక్.. అయూబ్‌కు మూడో వికెట్‌ను అందిస్తూ బౌల్డయ్యాడు. తర్వాత దూకుడు పెంచిన సూర్య.. దూబె (10 నాటౌట్)తో లాంఛనాన్ని పూర్తి చేశాడు.

### ఈ విజయం పహల్గాం ఉగ్రవాద దాడి బాధితులకు అంకితం : సూర్యకుమార్

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను భారత్ బహిష్కరించాలనే డిమాండ్లు వచ్చాయి. అయితే, ఎట్టకేలకు మ్యాచ్ జరగ్గా.. భారత్ ఏడు వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. దాయాది జట్టు నిర్దేశించిన 128 పరుగుల లక్ష్యాన్ని భారత్ 15.5 ఓవర్లలోనే ఛేదించింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ సందర్భంగా, మ్యాచ్ అనంతరం పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాతో భారత సారథి సూర్యకుమార్ యాదవ్ కరచాలనం చేయలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత సూర్యకుమార్ మాట్లాడుతూ ఈ విజయాన్ని పహల్గాం ఉగ్రదాడి బాధితులు, సాయుధ బలగాలకు అంకితమిస్తున్నట్లు చెప్పాడు. 'పహల్గాం ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఇదే సరైన సందర్భమని భావిస్తున్నాను. బాధిత కుటుంబాలకు మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించిన మన సాయుధ దళాలన్నింటికీ ఈ విజయాన్ని అంకితం చేయాలనుకుంటున్నాము. మనందరికీ వారు స్ఫూర్తినిస్తూనే ఉంటారు. అవకాశం దొరికినప్పుడల్లా వారి ముఖాల్లో చిరునవ్వు ఉండే విధంగా మా వంతు ప్రయత్నం చేస్తునే ఉంటాం" అని సూర్యకుమార్ వివరించాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్‌గా సూర్య అదరగొట్టాడు. 37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్ సాయంతో 47 పరుగులతో అజేయంగా నిలిచి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.



### వికెట్లు టపటపా..:

యూఏఈలో పిచ్‌లు, పరిస్థితులు మొదట బౌలింగ్ చేసే జట్లకే అనుకూలమన్న అంచనాలుండగా.. ఛేదనలో ఒత్తిడికి గురయ్యే అలవాటున్న పాకిస్థాన్ మాత్రం వరుసగా రెండో మ్యాచ్‌లోనూ టాస్ గెలిచి మొదట బ్యాటింగే చేసింది. ఆ నిర్ణయం తప్పని తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు. హార్దిక్ బౌలింగ్‌లో తొలి బంతికే అయూబ్ ఔటైపోయాడు. రెండో ఓవర్లో బుమ్రా.. హారిస్ (3)ను పెవిలియన్‌కు పంపించేశాడు. హార్దిక్ బౌలింగ్‌లో అయూబ్ క్యాచ్‌ను బుమ్రా అందుకుంటే.. బుమ్రా బౌలింగ్‌లో హారిస్ క్యాచ్‌ను హార్దిక్ పట్టాడు. వెంటనే బుమ్రా బౌలింగ్‌లో ఫకార్ జమాన్‌ను అంపైర్ ఎల్బీగా ప్రకటించడంతో పాక్ 6/3తో నిలిచింది. అయితే సమీక్ష కోరిన జమాన్.. నాటౌట్‌గా తేలాడు. అతను, ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ పట్టుదలతో నిలవడంతో పాక్ 7 ఓవర్లకు 44/2తో కాస్త కోలుకుంది. కానీ ఆ తర్వాత స్పిన్నర్ల మాయాజాలానికి ఆ జట్టు కుదేలైంది. అక్షర్ వరుస ఓవర్లలో జమాన్ (17), అఘా (3)లను ఔట్ చేసి పాక్‌ను గట్టి దెబ్బ తీశాడు. ఆ తర్వాత కుల్‌దీప్ అందుకున్నాడు. అతను వరుస బంతుల్లో హసన్ నవాజ్ (5), మహ్మద్ నవాజ్ (0)లను ఔట్ చేశాడు. 13 ఓవర్లకు 65/6తో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఆ జట్టు వంద పరుగులైనా చేస్తుందా అనిపించింది. కానీ ఓ ఎండ్‌లో ఫర్హాన్ పోరాటం కొనసాగించాడు. అర్ధశతకం దిశగా సాగుతున్న అతణ్ని కూడా కుల్‌దీప్ ఔట్ చేయగా.. ఫాస్ట్‌బౌలర్ షహీన్ అఫ్రిది ఆఖర్లో నాలుగు సిక్సర్లు బాది పాక్‌కు కాస్త గౌరవప్రదమైన స్కోరును అందించాడు.

### కరచాలనాల్లేవు..

ఆసియా కప్ ముంగిట విలేకరుల సమావేశంలో అంటీముట్టనట్లు వ్యవహరించిన భారత్, పాకిస్థాన్ కెప్టెన్లు సూర్యకుమార్, సల్మాన్ అఘా.. ఆదివారం మ్యాచ్‌లో టాస్ సందర్భంగా కరచాలనం చేసుకోలేదు. కనీసం ఒకరి వైపు ఒకరు చూడకుండానే టాస్ తంతు పూర్తిచేశారు. మ్యాచ్ అనంతరం కూడా ఇరు జట్ల ఆటగాళ్లు ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు.



# ఆసీస్‌దే తొలి వన్డే

**ముల్లాన్‌పుర్:** ప్రపంచకప్‌నకు సన్నాహకంగా ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ఆడుతున్న భారత మహిళల జట్టుకు శుభారంభం దక్కలేదు. క్యాచ్‌లు వదిలేసి.. బౌలింగ్‌లో విఫలమైన హర్మన్‌ప్రీత్ బృందం తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో ఓడింది. మొదట భారత్ 7 వికెట్లకు 281 పరుగులు చేసింది. ప్రతీక రావల్ (64), స్మృతి మంధాన (58) సత్తా చాటారు. హర్లీన్ డియోల్ (54) రాణించడంతో భారత్ మెరుగైన స్కోరు చేసింది. ఛేదనలో ఆసీస్ దూకుడుగా ఆడింది. ఓపెనర్లు ఫోబి లిచ్‌ఫీల్డ్ (88), అలీసా హీలీ (27) తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించి శుభారంభం అందించారు. తర్వాత పెర్రీ (30)తో కలిసి లిచ్‌ఫీల్డ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. బెత్ మూని (77 నాటౌట్), అనాబెల్ (54 నాటౌట్) చెలరేగడంతో ఆసీస్ 44.1 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక




# రికార్డు వసూళ్లతో 'మిరాయ్'

## అందుకే 'వైబ్' సాంగ్ తీసేశాం : కార్తిక్ ఘట్టమనేని

'మిరాయ్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. రెండు రోజుల్లో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.55.6కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం కొత్త పోస్టర్ పంచుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కథను వెబ్‌సిరీస్‌లా తీసి ఉంటే మరింత డీటెయిల్‌గా చెప్పేవాడినని అన్నారు. తేజ సజ్జా, మంచు మనోజ్, శ్రియ కీలక పాత్రల్లో నటించిన ఫాంటసీ అడ్వెంచర్ మూవీ ఇది. "సినిమాను చిన్నారులకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో నిడివి విషయంలో జాగ్రత్త తీసుకున్నాం. నా నిర్ణయమైతే.. 4 గంటల నిడివి ఉంచేవాడినేమో. ఈ విషయంలో ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎంతో సాయం చేశారు. ఎప్పటికప్పుడు సింపుల్‌గా వెళ్దామని సూచించారు. కథకు అడ్డం వస్తున్నాయని రెండు పాటలు తీసేశాం. 'వైబ్' సాంగ్ మాకు ఆప్షనల్. కుదిరితే పెడదాం. లేకపోతే వద్దనుకున్నాం. పాట విడుదల చేసినప్పుడు 'ప్రమోషనల్ సాంగ్' అని చెప్పి ఉంటే బాగుండేది" "అశోకుడి తొమ్మిది గంథ్రాలు ఉన్నాయన్న కథ ప్రచారంలో ఉంది. హిట్లర్ సహా పలువురు వాటి కోసం ప్రయత్నం చేశారట. అలా ప్రచారంలో ఉన్న కథలకు ఫాంటసీ జోడించి కథను సిద్ధం చేసుకున్నాం. అందులో భాగంగానే త్రేతాయుగం ప్రస్తావన తెచ్చాం. 'మిరాయ్' అంటే జపనీస్‌లో భవిష్యత్ అని అర్థం. టైటిల్ కోసం చాలా పదాలు అనుకున్నాం. కానీ, ఇది ఆసక్తికరంగా అనిపించింది. దర్శకుడు కిషోర్ తిరుమల పాత్రకు ఇంకొన్ని సన్నివేశాలు ఉన్నాయి. నిడివి కారణంగా అవి కట్ చేశాం. ప్రస్తుతం కథల్లో రాముడు, కృష్ణుడు పాత్రలను తీసుకోవడం తప్పేమీ కాదు. అయితే, కావాలని ఆ పాత్రలను ఇరికించకూడదు. మన జనరేషన్‌కు ఏదో ఒక విధంగా ఇతిహాసాలను దగ్గర చేయాలి" "శ్రియ పాత్ర నేపథ్యాన్ని మరో కథలో వాడుదామనే ఉద్దేశంతోనే పూర్తిగా చెప్పలేదు. ఖర్చు తగ్గించుకునే పనిలో భాగంగానే రియల్ లొకేషన్స్‌లో షూట్ చేశాం. వీఎఫ్ఎక్స్ కోసం ఎక్కువ సమయం వెచ్చించాం. అన్ని విషయాలను అర్థం చేసుకుని నడుచుకునే నటీనటులు మాకు దొరికారు. కారావాన్ లేకుండానే చాలా రోజులు షూట్ చేశారు. అందరూ కమిట్‌మెంట్‌తో పనిచేయడం వల్ల బడ్జెట్ కలిసొచ్చింది. పెద్ద పెద్ద స్టార్స్‌తో పబ్లిక్‌లో తీయడం కష్టం. కచ్చితంగా 'పార్ట్-2' ఉంటుంది" అని అన్నారు.

## అమ్మాయిలను చూడటానికి ఇష్టపడతారు

# కానీ వాళ్లు చెప్పేది వినరు : తమన్నా

తమన్నా భాటియా, డయానా పెంటీ ప్రధాన పాత్రల్లో వచ్చిన లేటెస్ట్ వెబ్‌సిరీస్ 'డూ యూ వానా పార్ట్‌నర్'. ప్రజెంట్ ఈ హిందీ వెబ్‌సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సిరీస్ సాధారణంగా మగవాళ్లను డామినేట్ చేసే ఆల్కహాలిక్ డ్రింక్స్ పరిశ్రమలోకి మహిళలు అడుగుపెట్టే కథను చూపిస్తుంది. ఈ సిరీస్ స్ట్రీమింగ్ సందర్భంగా రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్నా రియల్ 'డూ యూ వానా పార్ట్‌నర్' రియల్ లైఫ్‌ని ఎలా చూపిస్తుందో చెప్పుకొచ్చింది. 'సమాజంలో చాలా మంది మహిళలను చూడడానికి ఇష్టపడతారు. కానీ వాళ్లు చెప్పేది వినడానికి అంత ఇంట్రెస్ట్ చూపించరు. మహిళలు మామూలుగా ఉంటేనే వాళ్లకు నచ్చుతారు. వాళ్లు సలహాలు ఇస్తే నచ్చరు. ఒక మంచి ఆలోచన చెప్పిన వినరు' అని తెలిపింది.





# 'మీరా'గా శాలినీ పాండే..

ధనుష్, నిత్యా మీనన్ కాంబినేషన్‌లో వస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ మూవీ 'ఇడ్లీ కడై'. ధనుష్ స్వీయ డైరెక్షన్‌లో రాబోతున్న ఈ చిత్రంలో యంగ్ హీరోయిన్ శాలినీ పాండే ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమా రిలీజ్ సమయం దగ్గర పడటంతో ప్రమోషన్స్‌లో భాగంగా ఇడ్లీ కడైలో నటిస్తున్న నటీనటుల పాత్రలకు సంబంధించి వరుస అప్డేట్స్ ఇస్తున్నారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే ఇందులో శాలినీ పాండే 'మీరా' అనే పాత్రలో నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు టీమ్. ఇక ఇప్పటికే సత్యరాజ్, నిత్యా మీనన్ పాత్రలకు సంబంధించిన పోస్టర్స్ రిలీజై మంచి స్పందన దక్కించుకోగా.. ప్రజెంట్ శాలిని పోస్టర్ కూడా ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. కాగా.. అక్టోబర్ 1 గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధంగా ఉన్న ఈ సినిమాలో పార్తిబన్, సుమతిరకని, రాజ్ కిరణ్, అరుణ్ విజయ్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు.

# మొదటి ఫీమేల్ సూపర్ హీరోగా గుర్తింపు..

## ఎంతో గర్వంగా ఉంది : కల్యాణి ప్రియదర్శన్

'లోక చాప్టర్ 1: చంద్ర' (తెలుగులో కొత్త లోక) చిత్రంతో థియేటర్లలో కల్యాణి ప్రియదర్శన్ సందడి చేస్తున్నారు. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ రూ.కోట్లు వసూలు చేస్తోంది. దీనిపై కల్యాణి ప్రియదర్శన్ ఆనందం వ్యక్తంచేశారు. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాలో నటించడం గర్వంగా ఉందన్నారు. "మలయాళంలో 'లోక చాప్టర్ 1: చంద్ర' భారీ విజయం సాధించిన దగ్గర నుంచి అందరూ నన్ను ఫీమేల్ సూపర్ హీరో అని పిలుస్తున్నారు. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విజయం సాధించడానికి నాతో పాటు మా టీమ్‌లోని వారంతా కష్టపడ్డారు. ఈ సక్సెస్ క్రెడిట్ వాళ్లకు కూడా వెళ్తుంది. నేను ఈ చిత్రానికి సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని మాత్రమే ఆలోచించాను. చిత్రీకరణ చేసే సమయంలోనే ఇది కచ్చితంగా విజయం సాధిస్తుందని అర్థమైంది. ఈ సినిమా మొత్తాన్ని నేను భుజాలపై వేసుకొని మోసానంటూ ప్రేక్షకులు నన్ను అభినందిస్తున్నారు. కానీ, మా టీమ్‌లో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ దీనికోసం కష్టపడ్డారు. 'లోక చాప్టర్ 1: చంద్ర' మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రల్లోనైనా చేయగలరు అని అందరికీ నమ్మకం కలిగింది" అని కల్యాణి ప్రియదర్శన్ చెప్పారు. డామినిక్ అరుణ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకువచ్చింది. దుల్కర్ దీన్ని రూ.30 కోట్లతో నిర్మించగా.. ఇప్పటివరకూ రూ.200కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్ర బృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అత్యధిక వసూలు సాధించిన నాలుగో మలయాళ చిత్రంగా నిలిచిందని పేర్కొంది.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com